RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri
CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :31 సంచిక : 303 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: సోమవారం 08-06-2026 పేజీలు : 12 వెల: 1-00

## కేపీహెచ్‌బీలో పబ్‌పై రైడ్.. పోలీసుల అదుపులో 9 మంది




**హైదరాబాద్, జూన్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పబ్బులో మిగతా 2లో..



## మెట్రో విస్తరణను కేంద్ర మంత్రే అడ్డుకుంటున్నారు

### సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్ మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు పంపితే కేంద్రం ఆమోదించడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న ఓ నేత మెట్రో విస్తరణను దిల్లీలో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి భాజపాలోనే ఉండి.. కేటీఆర్‌కు మిగతా 2లో..

## టీవీకే ప్రభుత్వం మూడు నెలలైనా ఉంటుందా?

### డీఎంకే అధినేత స్టాలిన్



**చెన్నై, జూన్ 7:** తమిళనాడులో టీవీకే ప్రభుత్వం కనీసం మూడు నెలలైనా కొనసాగుతుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారని డీఎంకే అధినేత స్టాలిన్ అన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన కారణంగా 6నెలల వరకు విమర్శలకు దూరంగా ఉందామని అనుకున్నామని.. కానీ రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉందని అన్నారు. ఆ గడువు రాకముందే పరిణామాలు మారే విధంగా ఉన్నాయన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచే డీఎంకే 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం క్షేత్ర స్థాయిలో చర్యలు మొదలు పెట్టిందని వెల్లడించారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించడం, ప్రాంతీయ సమావేశాలు నిర్వహించడం వంటి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నా అధికారంలోకి రాలేకపోయామని అన్నారు. కానీ కొందరు మాత్రం మిగతా 2లో..

## తెలంగాణలో జూన్ 15న పాఠశాలలు పునః ప్రారంభం



**హైదరాబాద్, జూన్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణలో పాఠశాలలు ఈనెల 12వ తేదీకి బదులు 15న పునః ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వేసవి సెలవుల అనంతరం 12న పాఠశాలలు తిరిగి తెరుచుకోవాల్సి ఉంది. అయితే, ఈనెల 13న రెండో శనివారం, 14న ఆదివారం కావడంతో వేసవి సెలవులు పొడిగించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈనెల 12వ తేదీన సెలవు ఇచ్చినందున.. విద్యా సంవత్సరం నష్టపోకుండా జులై 11న రెండో శనివారం తరగతులు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు.

## హైదరాబాద్‌లో నేటి ఉదయం నుంచి ట్రాఫిక్ ఆంక్షలు



**హైదరాబాద్, జూన్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీ దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 6గంటల నుంచి మంగళవారం రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పేర్కొన్నారు. బస్సులు, వ్యాన్లలో వచ్చే వారు గాంధీభవన్, గృహకల్ప బస్టాప్‌ల నుంచి రావాలని సూచించారు. ఆటోల్లో వచ్చే వారికి షెజాన్ హోటల్ వద్ద ప్రత్యేక అలైటింగ్ పాయింట్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఏ అంశం మీద చర్చ పెట్టినా సిద్ధమే..

### సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి సవాల్



**హైదరాబాద్, జూన్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏ అంశం మీద ఎక్కడ చర్చ పెట్టినా తాను సిద్ధమేనని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆయన తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరన్నారు. పొలిమేరకు రాకుండా తనను ఆపేవారు తెలంగాణలో ఇంకా పుట్టలేదని వ్యాఖ్యానించారు. "రేవంత్‌రెడ్డిలా నేను పది పార్టీలు మారలేదు. నా పుట్టుక.. మిగతా 2లో..

## గర్భిణికి పోషకాహారం పంపిణీ

### ప్యాకెట్‌లో చనిపోయిన పాము పిల్ల




**పాట్నా, జూన్ 7:** మధ్యప్రదేశ్‌లోని పాంధుర్నా జిల్లాలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. ఓ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణికి పంపిణీ చేసిన పోషకాహార ప్యాకెట్‌లో చనిపోయిన పాము పిల్ల కనిపించడం కలకలం రేపింది. తీవ్ర భయాందోళనకు గురైన ఆమె కుటుంబీకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కర్మాట్ కామతీ గ్రామానికి చెందిన ఓ గర్భిణి స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల కొన్ని పోషకాహార ప్యాకెట్‌లు తీసుకున్నారు. తెరచి చూడగా.. ఒకదాంట్లో చనిపోయిన పాము పిల్ల ఉండటం చూసి అవాక్కయ్యారు. ఈ విషయం తెలిసి భయాందోళనకు గురైన కుటుంబీకులు, గ్రామస్థులతో కలిసి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి సిబ్బందితోపాటు ఉన్నతాధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రంగంలోకి దిగిన మహిళా శిశు సంక్షేమాభివృద్ధి శాఖ అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ కోసం ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. ఆహార ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకొని నమూనాలను టెస్టింగ్‌కు పంపించామని, నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## నీట్ పరీక్ష.. అందుబాటులోకి సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లు




**న్యూఢిల్లీ, జూన్ 7:** రీ-ఎగ్జామినేషన్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక అప్‌డేట్ ఇచ్చింది. అభ్యర్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రం ఏ నగరంలో ఉందనే సమాచారాన్ని మిగతా 2లో..


## మెట్రోలో ప్రయాణించిన సీఎం డీకే శివకుమార్



**బెంగుళూరు, జూన్ 7:** కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఆదివారం మెట్రో రైలులో ప్రయాణించారు. ముఖ్యమంత్రి మిగతా 2లో..

## కూర్చొని మాట్లాడుకుంటే ఏ సమస్యా పెద్దది కాదు

### నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్



**న్యూఢిల్లీ, జూన్ 7:** భారత్‌తో సరిహద్దు సమస్యలను దౌత్య చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. పరస్పర గౌరవంతో కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కరించుకోలేని సమస్య అంటూ ఏదీ ఉండబోదన్నారు. ఇరుదేశాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సరిహద్దు సమస్యలను పరిష్కరించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కైలాస – మానస సరోవర్ యాత్ర చాలా విభిన్నమైన సరిహద్దు పాయింట్ల ద్వారా జరుగుతోందని పేర్కొన్నారు. పర్యాటకుల్లో చాలా మంది నేపాల్ గుండా ప్రయాణిస్తారని.. కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతం ద్వారా భారత్, చైనాల మధ్య ఒప్పందాన్ని పునరుద్ధరించడంపైనే తాము ఆందోళన చెందుతున్నామని అన్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతంలోని భూమి తమదేనని.. నేపాల్ సమ్మతి లేకుండా ఇరు దేశాలు ఆ ఒప్పందాలను చేసుకోలేవని చాలా కాలంగా చెబుతూనే ఉన్నామని ఆ దేశ విదేశాంగ మంత్రి అన్నారు. ఈ విషయాన్ని మరోసారి భారత విదేశాంగ శాఖ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. కాగితంపై చేసిన పాత వాగ్దానాలకు, క్షేత్రస్థాయిలో నెరవేర్చిన వాస్తవికతకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే తమ బాధ్యత అని పేర్కొన్నారు. లిపులేఖ్, లింపియాధురా, కాలాపానీపై నెలకొన్న వివాదంపై నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఇటీవల మాట్లాడుతూ నేపాల్ భూభాగాలను భారత్ ఆక్రమించడమే కాదని, భారత భూభాగాలనూ నేపాల్ ఆక్రమించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ దేశ విదేశాంగ మంత్రి సరిహద్దు సమస్యల గురించి వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రపంచ వేదికపై వేగంగా ఎదుగుతోన్న భారత్‌తో కలిసి పని చేయడానికి తాము ఎదురు చూస్తున్నట్లు శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. వాణిజ్యం, సరిహద్దు అనుసంధానం, ఇంధన భాగస్వామ్యం, నీటి వనరుల నిర్వహణ వంటి అంశాలపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు.

## భారత్‌లో జననాల రేటు పడిపోవడంపై మస్క్ ఆందోళన



**న్యూఢిల్లీ, జూన్ 7:** ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం భారత్‌లో.. సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) పడిపోతుండటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా స్పందించారు. భారత్‌లో మిగతా 2లో..

# దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన బిజెపి

### కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో దేశ సంపద.... దిగజారుతున్న పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు

### కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా 9న సిపిఎం దేశవ్యాప్త నిరసనలు

**రాజమహేంద్రవరం,జూన్7(ఆర్ఎన్ఎ):** దేశ ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన పేపర్ లీకేజీలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక హక్కులపై దాడులకు వ్యతిరేకంగా జూన్ 9న దేశవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఓ సమావేశం శనివారం సిపిఎం కార్యాలయంలో జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిథి గా పాల్గొన్న వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేసిందన్నారు. సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, పేదలు మరియు మధ్యతరగతి ప్రజల జీవన పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకుందని, కోట్లాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో బలహీనపరుస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని,



వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాట మాడుతోందని, వివిధ ప్రవేశ, ఉద్యోగ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీశాయని అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాలపాటు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, ఎనిమిది గంటల పని విధానాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కార్మికులు సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి విస్తృత ఐక్య పోరాటాలు అవసరమని అన్నారు.ప్రజల జీవన సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రజల అసలు సమస్యలైన ఉపాధి, విద్య, వైద్యం, ధరల నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్ మాట్లాడుతూ ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 9న నిర్వహించే నిరసన కార్యక్రమాలలో ప్రజలు, యువత, విద్యార్థులు, కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రా పేపర్ లిమిటెడ్ కడియం యూనిట్ లో యాజమాన్యం నిరంకుశ వైఖరి కారణంగా 1200 మంది పర్మినెంట్ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్య పరిష్కారం చేయాలని కోరారు. సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి పవన్, పి తులసి, జిల్లా కమిటీ సభ్యులు సుందర బాబు, పూర్ణిమ రాజ్, ఎస్ ఎస్ మూర్తి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట ఏదీ?

ఆర్థిక కుంభకోణాలు, మోసాలను పసిగట్టలేక పోతున్నారు. దేశంలో ఎవరు ఎలా దోచేస్తున్నారో గుర్తించడం లేదు. అధికారంలో ఉన్నవారిది ఒక ర కమైన దోపిడీ, ఆర్థికంగా ఉన్నవారిది మరో రకమైన దోపిడీ అన్నట్లుగా కాలం నడుస్తోంది. అధికారంలో ఉండి ఆర్థిక మోసాలకు పాల్పడ్డ వారిని ఏమీ చేయడం లేదు. వారు అక్రమాలకు పాల్పడ్డట్లు రుజువులున్నా బోను ఎక్కించడం లేదు. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా చేస్తున్న పనులపై నిఘా లేకుండా పోయింది. అజమాయిషీ లేదు. విచారణలు లేవు. తెలంగాణలో కాళేశ్వరం కథ కంచికి చేరింది. లక్షకోట్లు పెట్టి ఓ ప్రాజెక్ట్ కడితే అందులో అవతవకలు, ఆర్థిక మోసాలు జరిగాయన్న వారే దానిపై విచారణ జరిపించడం లేదు. ఇ- కార్ రేసులో నేరుగా విదేశీ సంస్థకు డబ్బులు చెల్లించినా కిమ్మనడం లేదు. ఎపిలో రుషికొండపై జగన్ ప్యాలెస్‌లు కట్టుకుంటే చర్యలు లేవు. మద్యం కుంభకోణానికి పాల్పడితే దిక్కులేదు. భూకుంభకోణ్నాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే దేశంలో అనేక ఆర్థిక మోసాలు జరిగాయి. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ వంటివారు దేశం బయటనే ఉన్నారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు. దేశంలో కొందరు బ్యాంకులకు ఎగనామం వేస్తున్నా పట్టింపు లేదు. ఇవన్నీ కూడా ఇతరకుల ఆదర్శంగా నిలుస్తున్నాయని భావించాలి. తాజాగా రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. ఇలాంటి వారు మోసం చేస్తున్నా..గుర్తించలేక పోయారు. ఎల్ఐసి లాంటి సంస్థ ఇందులో పెట్టుబడులు పెట్టి ఇప్పుడు భారీగా నష్టపోయింది. ఆర్థిక మోసాలను ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా షేర్ మార్కెట్‌ను ఎలా మోసం చేశడో గుర్తుండే ఉంటుంది. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. సహారా ఇండియా, అగ్రిగోల్డ్, లీఫిన్ ఇండియా లాంటి సంస్థలు కూడా ఎంతగా మోసం చేశాయో చూసాం. ఇటీవల నల్లగొండ, కర్నూలు జిల్లాలో మైక్రో ఫైనాన్స్ మోసం బయటపడింది. అయినా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదు. చిట్టీల పేరుతో గ్రామాలు మొదలు పట్టణ్నాల వరకు కోట్లల్లో మోసలు చేస్తూనే ఉన్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం ఆర్ఇఎల్ తన వాస్తవ ఆదాయాన్ని రూ.15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచుకొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూర్టీస్ అండ్ ఎక్సేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా సెబి విచారిస్తే తప్ప వెలుగులోకి రాలేదు. ఆర్ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ.7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది. ఎక్కువ ఆదాయం చూపించి సత్యం కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. ఆదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది. చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఓ సామాన్యుడు సెబీకి లేఖ రాయడం, అది విచరణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూర్టీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేకపోవడం వ్యవస్థీకృతంగా ఉన్న జాఢ్యంగా చూడాలి. ఒక సాధారణ ఇన్వెష్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసులిచ్చినా ఆర్ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది. రార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలో కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్ఇఎల్ కూడా అదే చేసింది. సిట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించింది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించింది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లతనానికి నిదర్శనం. ఇలాంటివి ఇంకా ఎన్ని జరుగుతున్నాయో తెలియదు. బయటపడితే తప్ప తెలుసుకోలేం. ప్రజలు అనేక విధాలుగా ఇప్పుడు మోసపోతున్నారు. ఈ క్రమంలో పకడ్బందీ చర్యలతో ఆర్థిక మోసాలకు కళ్లెం వేయాలి. కేవలం సైబర్ మోసాలే కాకుండా ఇలాంటి బడా మోసాలపైనా దృష్టి సారించాలి.

# కరీంనగర్‌లో కూలిన లిఫ్ట్

### ఎమ్మెల్యే కవ్వంపల్లికి తప్పిన ప్రాణాపాయం

కరీంనగర్,జూన్7(ఆర్ఎన్ఎ): మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పెను ప్రమాదం తప్పింది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు ఎమ్మెల్యే వెళ్లారు. అయితే, కెమిస్ట్ భవన్ రెండో అంతస్తు నుంచి దిగుతూ లిఫ్ట్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక కారణాల వల్ల లిఫ్ట్ ఒక్కసారిగా రెండో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు పడిపోయింది. ప్రమాద సమయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లితో పాటు లిఫ్ట్‌లో మరో ఆరుగురు ఉన్నారు. ఏం జరుగుతుందో అర్థం కాక వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సిబ్బంది వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడటంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, ఎమ్మెల్యే కవ్వంపల్లి లిఫ్ట్ ప్రమాదానికి గురయ్యారని తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు, ఆయన అభిమానులు ఆందోళన చెందారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

### ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం.... హోర్ముజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు

**టెహ్రాన్, జూన్7(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

# పోలీసులకు లొంగిపోయిన సిఐ చినమల్లయ్య

**పల్నాడు, జూన్ 7(ఆర్ఎన్ఎ):** అత్యాచారం కేసులో గత కొన్ని వారాలుగా పరారీలో ఉన్న సీఐ చినమల్లయ్య ఎట్టకేలకు శనివారం తెల్లవారుజామున సుమారు 5 గంటల ప్రాంతంలో వినుకొండ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అధికారుల ముందు లొంగిపోయారు. తనపై సీఐ చినమల్లయ్య అత్యాచారం చేశాడంటూ.. ఏప్రిల్ 29న ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదైంది. నాటి నుంచి అరెస్ట్ భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిన చినమల్లయ్య, పోలీసులకు దొరకకుండా తప్పించుకుంటూనే ముందస్తు బెయిల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే, ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను అటు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుతో పాటు, ఇటు దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు కూడా కొట్టివేయడంతో ఆయనకు చట్టపరంగా ఎలాంటి ఊరట లభించలేదు. అన్ని కోర్టుల్లోనూ పిటిషన్లు తిరస్కరణకు గురికావడంతో అరెస్ట్ తప్పదని భావించిన చినమల్లయ్య, చివరికి వినుకొండ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు తదుపరి విచారణ జరుపుతున్నారు.

## వశిష్ట గోదావరిలో పడి యువకుడు మృతి

**భీమవరం,జూన్7(ఆర్ఎన్ఎ):** పశ్చిమగోదావరి జిల్లా వశిష్ట గోదావరి నదిలో స్నానానికి దిగి ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషాద సంఘటన ఆచంట మండలంలో చోటు చేసుకుంది. పిప్పర గ్రామానికి చెందిన జక్కంశెట్టి భానుప్రసాద్ (18) అనే యువకుడు వల్లూరు పంచాయతీ గెద్దాడవారిపాలెం లోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటున్నాడు. శుక్రవారం తన స్నేహితులతో కలిసి కరుగోరుమిల్లి పురస్కార రేవు వద్ద సరదాగా గోదావరిలో స్నానానికి దిగిన భానుప్రసాద్, అకస్మాత్తుగా కాలుజారి నీటిలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ÷ర్ సిబ్బంది గజఈతగాళ్లతో గాలించగా శుక్రవారం రాత్రికి భానుప్రసాద్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి గతంలోనే మరణించగా, తల్లి ఉపాధి కోసం విదేశాల్లో ఉంటోంది. కంటికి రెప్పలా చూసుకుంటున్న మనవడు కళ్లముందే అనంతలోకాలకు వెళ్లిపోవడంతో అమ్మమ్మ, తాతయ్యలతో పాటు బంధువులు, స్నేహితుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఆచంట ఎస్సై కే. వెంకటరమణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# అన్నామలై బాటలో సుమతి వెంకటేశ్

### బిజెపికి రాజీనామా చేసిన పార్టీ రాష్ట్రకార్యదర్శి

**చెన్నై,జూన్7(ఆర్ఎన్ఎ):** తమిళనాడు భారతీయ జనతా పార్టీలో సంక్షోభం మరింత ముదురుతోంది. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే. అన్నామలై, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్ పార్టీని వీడిన కొన్ని రోజుల్లోనే, మరో కీలక నేత పార్టీకి గుడ్‌బై చెప్పారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సుమతి వెంకటేష్ తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘమైన భావోద్వేగ లేఖను పంచుకున్నారు. భారమైన హృదయంతో తప్పుకుంటున్నానని.. చాలా రోజులు ఆలోచించిన తర్వాతే తాను ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నట్లు సుమతి వెంకటేష్ తెలిపారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తూ, పార్టీతో తన అనుబంధాన్ని ముగిస్తున్నానని ఆమె తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ పార్టీలో పనిచేయడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని కూడా సుమతి అన్నారు. అయితే, పార్టీ వీడినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, జాతీయవాదం, దేశభక్తి సిద్ధాంతాలు తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని సుమతి వెంకటేష్ స్పష్టం చేశారు. తన పదవీ కాలంలో సహకరించిన జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలకు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడులో బీజేపీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లిన కె. అన్నామలై ఇటీవల పార్టీకి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. వంశపారంపర్య రాజకీయాలు, వ్యక్తిగత ఆరాధనలకు దూరంగా, సాధారణ ప్రజల రాజకీయం తీసుకురావడమే లక్ష్యంగా తాను సరికొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

# ఆదాయం కోసం అడ్డగోలు నిర్ణయాలు

### భూముల విలువలకు తోడు..మద్యం ధరలు.... ఈ నెలలోనే మద్యం ధరలు పెంచే యోచన

**హైదరాబాద్,జూన్7(ఆర్ఎన్ఎ):** రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువలను పెంచేసింది. ఆదాయం సమకూర్చుకోవడం లక్ష్యంగా ఎట్టకేలకు శుక్రవారం నుంచి అమలులోకి తెచ్చింది. మరో వారం పదిరోజుల్లో మద్యం ధరలు కూడా పెరగనున్నాయి. ఒక్కో బాటిల్‌పై 80 నుంచి వందవరకు పెంచుతారన్న ప్రచారం సాగుతోంది. తెలంగాణలో మద్యం ధరలు పెరగనున్నాయి. పెరిగిన ధరలు ఈనెల 15 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. లిక్కర్ తయారీ కంపెనీల ఒత్తిడి మేరకు ప్రభుత్వం మద్యం ధరలను పెంచడానికి సిద్ధమైనట్లు సమాచారం. ముడి సరుకుల ధరలు, రవాణా ఖర్చులు బాగా పెరిగిన నేపథ్యంలో మద్యం ధరలను కూడా పెంచాలని లిక్కర్ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈమేరకు ప్రభుత్వం కూడా సానుకూలంగానే ఉంది. భూముల ధరలు పెంచడం, మద్యం ధరలు పెంచడం ద్వారా ఉచిత పథకాలకు ఢోకా లేకుండా చూసుకుంటున్నారు. అలాగే భూములను కూడా ఎక్కడికక్కడ తెగనమ్ముతున్నారు. ఇదిలావుంటే ఈసారి భూముల విలువలు పెరుగుతాయనే అనుమానంతో ఆస్తుల క్రయ, విక్రయదారులు గురువారం వరకు పెద్ద మొత్తంలో స్లాట్లు బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తాజాగా, భూముల మార్కెట్ విలువలు రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి రాగానే రిజిస్ట్రేషన్లు తక్కువ సంఖ్యలో అయ్యాయి. ప్రతి జిల్లాలో సగటున 50శాతం వరకు భూ విలువలు



పెరగ్గా, కమర్షియ ల్ ప్రాంతాల్లో భారీగా పెంచారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ అధికారులు పెద్దగా పెంపు లేదని చెబుతున్నా, ప్రాంతాల వారీగా పెరిగిన మార్కెట్ విలువలను చూస్తుంటే రిజిస్ట్రేషన్ల భారం అధికంగానే ఉంది. భూముల ధరలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలతో పాటు అభివృద్ధి, పారిశ్రామిక ప్రాంతాలు ఉన్న చోట మార్కెట్ విలువలను 50శాతం మేర పెంచారు. గ్రామీణ, పట్టణాల్లో క్షేత్రస్థాయి అధ్యయనం చేసి శాస్త్రీయంగా మార్కెట్ విలువలను సవరించామని అధికారులు చెబుతున్నా, ఆస్తుల క్రయ విక్రయదారులకు భారీగానే భారం మోపారని తెలుస్తోంది. ధరలు పెరుగుతాయని ముందస్తు సమాచారం తోనే పాత ధరలకే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పలువురు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. భూముల విలువలు సవరణతో మార్కెట్ విలువ ప్రకారం అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రిజిస్ట్రేషన్లు భారం కానున్నాయి.

వాస్తవానికి ఏటా కొంత మేరకు మార్కెట్ విలువలను సవరించాల్సిన ప్రభుత్వం ఏకంగా ఒకేసారి పెంచడంతో ఆస్తుల క్రయవిక్రయదారులపై భారం పెరిగింది. ప్రజలపై భారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ ఖజానాను నింపేలా మాత్రమే అధికారులు కసరత్తు చేశారని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అధికారులు గతంలో ఉన్న మార్కెట్ విలువలను రెట్టింపు చేశారని, ఇది శాస్త్రీయంగా లేదని పలువురు పేర్కొంటున్నారు. వ్యవసాయ భూముల విలువను సైతం భారీగా పెంచడంతో ఆస్తుల కొనుగోలుదారులు ఆందోళనకు గురవుతున్నారు. కమర్షియల్ ప్రాంతాల్లో 100శాతం మేరకు మార్కెట్ విలువలను పెంచారు. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో, రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్న చోట స్వల్పంగా పెంచినా, పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరేలా మార్కెట్ విలువను పెంపుదల చేశారు. మార్కెట్ విలువలు పెరగడంతో స్టాంపు డ్యూటీ, ఇతర రిజిస్ట్రేషన్ చార్జీల భారం సామాన్య, మధ్య తరగతి ప్రజలపై అధికంగానే ఉండనుంది.

# అల్లం, తేనె, నల్ల మిరియాలు ఉపయోగించి దగ్గుకు సహజమైన ఇంటి నివారణ





**ఇంట్లో దీన్ని పరిష్కరించండి:** అల్లం, తేనె ,నల్ల మిరియాలు ఉపయోగించి దగ్గుకు సహజమైన, సమర్థవంతమైన ఇంటి నివారణ సీజనల్ గా వచ్చే మార్పు సమయంలో జలుబు, దగ్గు సర్వసాధారణం. మనము శీతాకాలం నుండి వేసవి కాలానికి మారుతున్నప్పుడు, మీరు ఇంట్లో చేసే దగ్గుకు సహజమైన, ప్రభావవంతమైన ఇంటి నివారణ ఇక్కడ ఉంది. రుతువుల మార్పు సమయంలో జలుబు , దగ్గు చాలా సాధారణం దగ్గుకు సమర్థవంతమైన ఇంటి నివారణ ఇక్కడ ఉంది. మీరు ఇంట్లో తయారు చేసుకోవచ్చు, దుష్ప్రభావాల ప్రమాదం లేకుండా వాడవచ్చు.

**వాతావరణం మారినప్పుడు**

వాతావరణం మారినప్పుడు ,సీజన్ శీతాకాలం నుండి వసంతకాలం వరకు మారడం ప్రారంభించినప్పుడు, మిమ్మల్ని మీరు సురక్షితంగా ఉంచడానికి చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తినడం మరియు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, సీజన్ మార్పు సమయంలో సాధారణమైన అంటువ్యాధుల నివారణకు సహాయపడుతుంది – సాధారణ జలుబు మరియు దగ్గు వంటివి. అయితే, కొన్నిసార్లు, మీరు అంటువ్యాధులను నివారించడానికి ఎంత ప్రయత్నించినా, అవి ఏదో ఒకవిధంగా మీకు వస్తాయి.

**ఇంటి నివారణలను**

ఇటువంటి సందర్భాల్లో, ఇంటి నివారణలు మీ రక్షణకు రావచ్చు. మీరు రెగ్యులర్ ఔషధాలను తీసుకుంటు న్నప్పుడు కూడా మంచి అనుభూతి చెందడానికి మీరు ఈ ఇంటి నివారణలను ఉపయోగించవచ్చు, ఎందుకంటే ఇవి ఇన్ఫెక్షన్ లక్షణాలను తొలగించ డానికి సహాయపడతాయి. ఇక్కడ అలాంటి ఒక ఇంటి నివారణ ఉంది – మీరు ఇంట్లో తయారుచేసే దగ్గు సిరప్, ఇది దగ్గును తగ్గించడంలో సహాయపడటమే కాకుండా, మీకు చాలా నిద్ర అనిపిస్తే వైద్య దగ్గు సిరప్‌కు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగించవచ్చు.

**ఇంట్లో తయారుచేసిన, సహజ దగ్గు సిరప్**

మీరు ఈ సహజ దగ్గు సిరప్‌ను ఇంట్లో, కొన్ని సాధారణ వంటగది పదార్థాల సహాయంతో తయారు చేయవచ్చు.

**లాభాలు**

ఈ దగ్గు సిరప్‌ను అల్లం, నల్ల మిరియాలు, తేనెతో తయారు చేస్తారు. ఈ పదార్థాలన్నింటికీ జలుబు చికిత్సకు సహాయపడే కొన్ని లక్షణాలు ఉన్నాయి. అల్లం యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ సూక్ష్మజీవుల లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది గొంతులోని మంటను తగ్గించడంలో సహాయపడుతుంది మరియు వ్యాధి కలిగించే సూక్ష్మ జీవిపై పోరాడటానికి కూడా సహాయపడుతుంది. నల్ల మిరియాలు సాధారణంగా వివిధ ఆయుర్వేద మందులు మరియు పానీయాలలో కనిపిస్తాయి. ఇది నాసికా మరియు గొంతు మార్గంలోని నిక్షేపాలను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడుతుంది. వాటిని శరీరం నుండి తొలగించడానికి సహాయపడుతుంది, సాధారణంగా శ్వాస తీసుకోవడానికి ఎక్కువ మార్గం చేస్తుంది, దగ్గును తగ్గిస్తుంది. ఇంట్లో తయారుచేసిన దగ్గు సిరప్ యొక్క మూడవ పదార్థం తేనె గొంతు నొప్పిని ఉపశమనం చేస్తుంది, రద్దీని శుభ్రపరుస్తుంది.

**సహజ దగ్గు సిరప్ ఎలా తయారు చేయాలి**

దగ్గు సిరప్ చేయడానికి, ఈ సులభమైన దశలను అనుసరించండి – వేడి చేయడానికి ఒక గిన్నెలో నీరు తీసుకోండి అల్లం చిన్న చిన్న ముక్కలు చేసి, నీటిలో కలపండి మంటను తగ్గించి పెట్టుకోండి మరియు అల్లం రుచితో నీటిని నింపండి 1-2 నిమిషాల తరువాత, నీరు ఉడకబెట్టడం ప్రారంభించి నప్పుడు, కొన్ని మిరియాలు పొడి చేసి ఆ మరిగే నీటిలో కలపండి నీటిని మరొక గిన్నెలో వడకట్టండి ఈ మిశ్రమానికి తేనె జోడించండి మిశ్రమాన్ని కొద్దిగా చల్లబరచండి మరియు ఒక కప్పులో సర్వ్ చేయండి. అంతే హోం మేడ్ కఫ్ సిరఫ్ రెడీ.

# శీతాకాలంలో బరువు తగ్గడం సులభమే..!

## ఎలాగో తెలుసుకోండి!

ఊబకాయం తరచుగా మిమ్మల్ని అనేక విధాలుగా ప్రభావితం చేస్తుంది. అందువల్ల, ప్రతి ఒక్కరూ దానిని ఎలాగైనా తొలగించగల స్థితిలో ఉన్నారు. శీతాకాలం ఎలాంటి వ్యాయామాలు, శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఊబకాయం తగ్గించుకోవడం కష్టతరమైన సమయం కాదనే వాస్తవం మిమ్మల్ని ఊబకాయానికి దారితీస్తుంది. కానీ ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి మరియు ఊబకాయానికి పరిష్కారం కనుగొనటానికి, మనకు ఇంటి నివారణలు ఉన్నాయి.

ఊబకాయం తొలగించడానికి శీతాకాలంలో మనం జాగ్రత్త వహించే కొన్ని ప్రభావవంతమైన చిట్కాలు ఉన్నాయి. అవి ఏమిటో మనం చూడవచ్చు. ఈ శీతాకాలంలో ఊబకాయం రాకుండా ఉండటానికి ఈ క్రిందివి ప్రభావవంతమైన మార్గం.

ఇది మిమ్మల్ని ఉత్తేజపరుస్తుంది అలాగే మిమ్మల్ని ఆరోగ్యంగా మరియు బలంగా ఉంచుతుంది. ఆరోగ్య సంరక్షణ కోసం మనం ఏమి శ్రద్ధ వహించాలో మరియు ఊబకాయాన్ని పరిష్కరించడానికి మనం ఏమి చేయాలో చూద్దాం.

**తాజా ఆహారం మరియు కూరగాయలు తినండి**

మిగిలిన ఆహారం తినడం చాలా మందికి తరచుగా అలవాటు. కానీ ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తినే వారికి ఇది మంచిది కాదు. ఊబకాయానికి పరిష్కారం కోసం చాలా మంది ప్రజలు తిరుగుతూ ఉంటే, వారు పరిష్కారం కోసం పైన పేర్కొన్న ఆహారాలు ఏవీ తినకుండా జాగ్రత్త వహించాలి. మీరు ఎంత సోమరితనం ఉన్నా, తాజా ఆహారాన్ని మాత్రమే తినాలని నిర్ధారించుకోండి. కూరగాయలు, పండ్లు పుష్కలంగా ఆహారంలో చేర్చడానికి జాగ్రత్త తీసుకోవాలి. సీజనల్ గా మార్కెట్లో చాలా కూరగాయలు మరియు పండ్లు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ తినడానికి జాగ్రత్త తీసుకోవాలి. ఇవన్నీ స్థూలకాయానికి పరిష్కారాన్ని కనుగొనే శీఘ్ర మార్గాలలో ఒకటి.

**మూలికల టీ**

మీకు చాక్లెట్ మరియు స్వీట్లు ఇష్టమా? కానీ బరువు పెరగడంలో ఆశ్చర్యం కలిగించదు. ఎందుకంటే నిజం ఇవన్నీ ఊబకాయానికి దారితీస్తుంది. కానీ మీరు చాక్లెట్ మరియు స్వీట్లను పూర్తిగా నివారించవచ్చు మరియు హెర్బల్ టీ తాగవచ్చు. ఇది కేలరీలను బర్న్ చేయడానికి,



టాక్సిన్స్ ను శరీరం నుండి బహిష్కరించడానికి మరియు ఉదరం నుండి శరీర కొవ్వును తొలగించడానికి మీకు సహాయపడుతుంది. గ్రీన్ టీ, హెర్బల్ టీ, చమోమిలే టీ మరియు బ్లాక్ టీ త్రాగడానికి జాగ్రత్త తీసుకోవాలి. శీతాకాలంలో ఊబకాయం మరియు ఇతర సంక్షోభాలను



పరిష్కరించడంలో ఇది సహాయపడుతుంది. ఊబకాయం నివారణ కోసం చూస్తున్న వారికి ఇప్పుడు హెర్బల్ టీ అందుబాటులో ఉంది.

**భోజనానికి ముందు సూప్**

భోజనానికి ముందు సూప్ త్రాగడం అలవాటు చేసుకోండి. ఇది మీ ఆకలిని నియంత్రిస్తుంది మరియు శరీరం నుండి విషాన్ని తొలగించడానికి సహాయపడుతుంది. అతిగా తినడం వల్ల మీరు ఎక్కువ కేలరీలను బర్న్ చేయలేక ఊబకాయం కలిగి ఉంటారు. ఇది అప్పుడప్పుడు శరీరంలో కొవ్వు పేరుకుపోవడానికి కారణమవుతుంది. కానీ తినడానికి ముందు కొద్దిగా సూప్ త్రాగడం ప్రయత్నించండి. మీరు ఈ విషియంలో కూడా జాగ్రత్తగా ఉండాలంటే, తక్కువ కేలరీల సూప్ త్రాగడానికి జాగ్రత్తగా ఉండాలి. శీతాకాలంలో కొద్దిగా సూప్ త్రాగడం వల్ల మీరు ఎందుకు అధిక బరువుతో ఉన్నారో గుర్తించవచ్చు.

**ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం**

ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని పుష్కలంగా తినడం వల్ల బరువు తగ్గవచ్చు మరియు అవాంఛిత శరీర కొవ్వును వదిలించుకోవచ్చు. అందువల్ల, అటువంటి సందర్భాలలో, ఒక పరిష్కారం కోసం ప్రోటీన్ అధికంగా ఉన్న ఆహారాన్ని తినడానికి జాగ్రత్త తీసుకోవాలి. ఇది శరీరంలో జీవక్రియను పెంచుతుంది మరియు ఊబకాయం పరిష్కరించడంలో సహాయపడుతుంది. శరీరంలోని అన్ని పోషకాలను గ్రహించడానికి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని తినడం చాలా అవసరం. ఇది శరీరంలోని చక్కెర శాతం పెరగకుండా డయాబెటిస్ నుండి ఉపశమనం పొందడంలో కూడా సహాయపడుతుంది.

**ఆరోగ్యకరమైన కొవ్వు**

శరీరంలో ఆరోగ్యకరమైన కొవ్వు పరిమాణాన్ని పెంచడం స్థూలకాయానికి అవసరమైన నివారణలలో ఒకటి. ఊబకాయం నివారించడానికి మనం ప్రోటీన్ ఉన్న మంచి కొవ్వు అధికంగా ఉండే ఆహారాన్ని తినడానికి ప్రయత్నించాలి. ఇది మీ ఆరోగ్యానికి చాలా సహాయపడుతుంది. బాదం, జీడిపప్పు, అక్రోట్లను, ఆలివ్ ఆయిల్ తినడం వల్ల ఆరోగ్యకరమైన శరీర కొవ్వు పెరుగుతుంది. అందువల్ల, ఈ కొవ్వు – అధికంగా ఉండే ఆహారాలు అటువంటి పరిస్థితులకు చికిత్స చేయడానికి, ఊబకాయాన్ని నివారించడానికి మరియు శరీర కొవ్వును నియంత్రించడానికి ఉత్తమమైనది.

# ముఖం మెరుస్తూ ఉండటానికి దోసకాయ, పుదీనా..!



ఈ ఆధునిక జీవితంలో చాలా బిజీగా గడుపుతుంటాము. నిద్రలేచినప్పటి నుండి పడుకునే వరకు ఉరుకుల పర్నుల జీవితం.ఇలాంటి జీవనశైలిలో మన చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం మర్చిపోతాం. మనం చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోకపోతే, చర్మ సమస్యలు చాలా వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల చర్మం పొడిగా, అలసిపోయి, నిర్జీవంగా పొరలుగా కనిపిస్తుంది. ఈ చర్మ సమస్యలు సూర్యుడి అతినీలలోహిత కిరణాలు, కాలుష్యం వల్ల కలుగుతాయి. ఈ చర్మ సమస్యల నుండి బయటపడటానికి ఖరీదైన క్రీములను ఉపయోగించాల్సిన అవసరం లేదు. సులభంగా లభించే ఉత్పత్తులతో మీరు సహజంగా చర్మ సమస్యలను వదిలించుకోవచ్చు. మీ ముఖం మీద నల్లటి వృత్తాలు తొలగించడానికి దోసకాయ ఉత్తమ పరిష్కారం. దోసకాయతో పాటు మరికొన్ని పదార్థాలను కలుపుకుంటే ముఖం మీద కనిపించే నల్లటి వలయాలు, బ్లాక్‌హెడ్స్‌ను సులభంగా తొలగించవచ్చు. బంగాళాదుంప రసం , దోసకాయ కలయిక బంగాళాదుంప బ్లీచింగ్ లక్షణాలను కలిగి ఉన్నందున తేలికపాటి స్కిన్ టోన్ పొందడానికి సహాయపడుతుంది. మీకు ఒక బంగాళాదుంప రసం (పరిమాణంలో చిన్నది), సగం దోసకాయ రసం అవసరం. ఈ రెండింటినీ కలిపి మీ చర్మంపై కాటన్ బాల్‌తో చర్మంపై అప్లై చేయండి. చర్మం కాంతివంతంగా మెరిసిపోతుంది. మిల్క్ పౌడర్, దోసకాయ రసం పాలపొడి , దోసకాయ రసంతో పేస్ట్‌ను తయారుచేయండి. ఈ పేస్ట్ ను మీ ముఖం, మెడపై వర్తించండి. అది ఎండిన తర్వాత చర్మాన్ని మెత్తగా మసాజ్ చేసి గోరువెచ్చని నీటితో కడగాలి. మంచి ఫలితాల కోసం మీరు ఈ పేస్ట్‌కు ఒక గుడ్డు తెలుపును కూడా జోడించవచ్చు. వారానికి ఒకసారి ఇలా చేయండి. పుదీనా ఆకులు, దోసకాయ ప్యాక్ పుదీనా ఆకుల యాంటీ ఫంగల్ , యాంటీ బాక్టీరియల్ లక్షణాలతో చర్మంలో నలుపు రంగును తొలగించవచ్చు. బ్లెండర్లో, పుదీనా ఆకులు, దోసకాయ ముక్కల మందపాటి పేస్ట్ తయారు చేయండి. మీ ముఖం మీద ఉంటే సన్నని పొరను అప్లై చేసి అరగంట పాటు ఉంచండి. గోరువెచ్చని నీటితో కడగాలి. వారానికి నాలుగు సార్లు ఇలా చేయండి. నిమ్మరసం, దోసకాయ నిమ్మరసం బ్లీచింగ్, యాంటీ మైక్రోబియల్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు మీ చర్మం నుండి మచ్చలను తొలగించడానికి సహాయపడతాయి.

# కాంగ్రెస్ పాలనలో పాలమూరుకు ద్రోహం

**తెలంగాణ నీటిని ఎపికి దోచిపెట్టే కుట్ర... సగునీటి సలహారుగా ఆంధ్రాప్రాంత వ్యక్తి**

**మీడియా సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాసగౌడ్**

**మహబూబ్‌నగర్,జూన్7(ఆర్ఎన్ఎ):** కాంగ్రెస్ పాలనలో అన్ని జిల్లాల కంటే ఎక్కువ నష్టం మహబూబ్‌నగర్ కు జరిగిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ నీటిని ఆంధ్రాకు దోచిపెట్టే కుట్రలు జరుగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆంధ్రా వ్యక్తిని సాగునీటి సలహాదారుగా పెట్టి తెలంగాణకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఏపీకి నీళ్లు తీసుకుపోయి పాలమూరును ఎండబెడతారంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నిన్న మంత్రి, ముఖ్యమంత్రి మాటలకు ప్రజల నుంచి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా చిల్లర మాటలను సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని హితవుపలికారు. పాత చింతకాయ పచ్చడిలా రేవంత్ రెడ్డి ప్రసంగం ఉందని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్‌లో శనివారం ఉదయం మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం పర్యటన గురించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూశారని తెలిపారు. కానీ ఉమ్మడి



జిల్లా ప్రజలకు సీఎం ఇచ్చింది ఏమీ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చి కేసీఆర్ కట్టిన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లను పరిశీలించిన వెళ్లారని తెలిపారు. కర్ణాటక జల దోపిడీకి మనం నిధులు ఇవ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును సీఎం ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. ఇప్పటికే జూరాలకు చుక్కనీరు వస్తలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులను పడావు పెడుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో చర్చలు కొలిక్కి రాకుండానే బ్యారేజి కమ్ బరాజ్‌లపై ఎలా ఏరియల్ సర్వే చేశారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్వోసీ ఇస్తే బనకచర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తానని అంటున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ జల హక్కులపై చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మీరు తిరిగే రిజర్వాయర్‌లు కట్టింది కేసీఆర్ కాదా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి తట్టెడు మట్టిని కూడా రేవంత్ ప్రభుత్వం తీయలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును డిజైన్ చేసింది 45 కిలోమీటర్ల కాలువలు అని.. అందులో41 కిలోమీటర్ల కాలువలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం రూ.33,500కోట్ల పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ చేసిందని చెప్పుకుంటారా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి పనుల జాప్యానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

# ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం

**అకాల్ తఖ్త్ వద్ద ఖలిస్తాన్ అనుకూల నినాదాలు**

**చండీఘడ్,జూన్7(ఆర్ఎన్ఎ):** పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న ప్రముఖ సిక్కు మత కేంద్రం అకాల్ తఖ్త్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు వినిపించాయి. సిక్కు మిలిటెంట్ నాయకుడు జర్నైల్ సింగ్ భింద్రాన్‌వాలే పోస్టర్లు వెలిశాయి. జూన్ 6, 1984న భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ బ్లూ స్టార్‌లో భింద్రన్‌వాలే మరణించారు.ప్రతి ఏటా జూన్ 6వ తేదీన సిక్కు సమాజంలోని కొన్ని వర్గాలు 'ఘల్లోఘూరా దివస్'గా పాటిస్తాయి. ఈ ఏడాది కూడా భింద్రన్ వాలేను స్మరించుకుంటూ కొందరు కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పంజాబ్ పోలీసులు అమృత్‌సర్, దాని పరిసర ప్రాంతాలలో విస్తృతమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల ప్రత్యేక డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్ సిన్హా జూన్ 4న జిల్లాలో పర్యటించి, బలగాల మోహరింపును సమీక్షించారు. దాదాపు 4,000 మంది పోలీసు సిబ్బందిని రక్షణ కార్యక్రమాల్లో భాగం చేశారు. కాగా, భింద్రన్‌వాలేను సిక్కు సమాజంలోని కొంతమంది అమరవీరుడిగా భావిస్తే, మరికొందరు ఆయనను పంజాబ్‌లో తీవ్రవాద ఉద్యమానికి ప్రతీకగా చూస్తారు.

# రాజ్యసభకు లింగమనేని నామినేషన్

**కూటమి ఎమ్మెల్యేలు మద్దతుగా హాజరు... స్వగ్రామంలో రమేశ్‌కు మద్దతుగా సంబరాలు**

**అమరావతి,జూన్7(ఆర్ఎన్ఎ):** రాజ్యసభ అభ్యర్థిగా జనసేన తరపున లింగమనేని రమేష్ అసెంబ్లీలో నామినేషన్ దాఖలు చేశారు. రమేష్ నామినేషన్ పై ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు తెదేపా ఎమ్మెల్యేలు, ఒక భాజపా ఎమ్మెల్యే సంతకాలు చేశారు. రమేష్ వెంట మద్దతుగా కూటమి ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్ నాయకర్, వంశీకృష్ణ శ్రీనివాస్, దేవ వరప్రసాద్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, కాగిత కృష్ణ ప్రసాద్, నక్కా ఆనంద్ బాబు, ఎన్ ఈశ్వర రావు (బీజేపీ) వెళ్లారు.

జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేశ్ నామినేషన్ దాఖలు చేశారు. రమేశ్ నామినేషన్‌ను 10 మంది కూటమి ఎమ్మెల్యేలు ప్రతిపాదించారు. రమేష్ నామినేషన్‌పై ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే సంతకాలు చేశారు. లింగమనేని వెంట మద్దతుగా కూటమి ఎమ్మెల్యేలు వెళ్లారు. జనసేన అభ్యర్థిగా రాజ్యసభకు నామినేషన్ వేసినట్లు రమేశ్ తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరిచిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు లింగమనేని రమేశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నిక అయ్యాక అందరితో మరోసారి మాట్లాడుతానని రమేశ్ వెల్లడించారు. ఇదిలావుంటే లింగమనేని రమేశ్ రాజ్యసభకు ఎంపికవడంపై స్వగ్రామం మొవ్వ మండలం పెద్ద ముత్తెవిలో సంబరాలు అంబరాన్నంటాయి. రమేశ్.. గ్రామస్థాయి నుంచి రాజ్యసభ వరకు ఎదిగారని గ్రామస్థులు తెలిపారు. పెదముత్తేవి శ్రీలక్ష్మీపతి స్వామి ఆలయంలో రమేశ్ విజయానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టుదలతో చిన్న వ్యాపారాల నుంచి రమేశ్ ఎదిగారని హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు అన్నారు. రమేశ్‌కు ఇంకా ఉన్నత పదవులు రావాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

# నార్సింగ్ స్టేషన్‌కు బొల్లా బ్రహ్మనాయుడు

**కాంచీపురం నుంచి తరలించిన పోలీసులు**

**హైదరాబాద్,జూన్7(ఆర్ఎన్ఎ):** గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో వైసిపి నేతలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. పరారీలో ఉన్న ఆయన్ను తమిళనాడులోని కాంచీపురం నుంచి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంచీపురం నుంచి రోడ్డు మార్గం గుండా నార్సింగికి పోలీసులు తీసుకొస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన తర్వాత బ్రాహ్మనాయుడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు. భూకబ్జా కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బ్రాహ్మనాయుడి అరెస్ట్‌తో ఆ సంఖ్య ఆరుకు చేరింది. మాజీ ఎమ్మెల్యేను నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారన్న సమాచారంతో పీఎస్ వద్దకు పెద్ద సంఖ్యలో వినుకొండ వైసీపీ కార్యకర్తలు చేరుకున్నారు. శుక్రవారమే బ్రహ్మనాయుడిని కాంచీపురంలో అరెస్ట్ చేసిన పోలీసులు.. అక్కడ స్థానికంగా ఉన్న కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం నార్సింగి పీఎస్‌కు తరలించారు. గండిపేటలోని సర్వేనెంబర్ 18లో సుమారు వంద ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో తొమ్మిది ఎకరాలకు పైగా కాజేసేందుకు నిమ్మల కుటుంబసభ్యులు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, నకిలీ పత్రాలను సృష్టించడంలో మధ్యవర్తి రాధాకృష్ణకు బ్రహ్మనాయుడు సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సైబరాబాద్ పోలీసుల దర్యాప్తులో బయటపడింది. తహశీల్దార్ ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఐదు మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు విషయం తెలిసిన వెంటనే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. ఆయనపై సైబరాబాద్ పోలీసులు నిఘా ఉంచారు. కొంతకాలం బెంగళూరులో ఉన్న బ్రహ్మనాయుడు అక్కడి నుంచి కేరళకు వెళ్లి ఆపై తమిళనాడులోని కాంచీపురంకు వెళ్లారు. బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు సమాచారం అందిన వెంటనే నార్సింగి పోలీసుల బృందం, ఈవోడబ్ల్యూకు సంబంధించిన మరో బృందం అక్కడకు చేరుకుని మాజీ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు.

## 35 ఏళ్ల సుదీర్ఘ సేవలు అమోఘం

**-హోంగార్డు నాయిని రాజేందర్ కు సీపీ గౌస్ ఆలం ఘన వీడ్కోలు**



**కరీంనగర్, జూన్ 07: నేటి మన దేశమ్ ప్రతినిధి** పోలీసు శాఖలో హోంగార్డుగా చేరి, 35 సంవత్సరాలుగా నిస్వార్థంగా సేవలందించిన నాయిని రాజేందర్ పదవీ విరమణ సందర్భంగా శనివారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, రాజేందర్ ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ కమీషనరేట్ కేంద్రంలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించిన నాయిని రాజేందర్, తన 35 ఏళ్ల సర్వీసులో ఎంతో అంకితభావంతో, నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమని, క్షేత్రస్థాయిలో వారు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన రాజేందర్ శేష జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో నాయిని రాజేందర్ కు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. తన సర్వీసు కాలంలో తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ, విధుల్లో క్రమశిక్షణ పాటించిన ఆయనను పలువురు అధికారులు అభినందించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (హోంగార్డ్స్) శ్రీధర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవి మరియు కమిషనరేట్‌కు చెందిన ఇతర పోలీసు అధికారులు, హోంగార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు.

**సిపిఐ సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి.**
**వేములవాడలో ముగిసిన సిపిఐ రాజకీయ శిక్షణా శిబిరం.**




**వేములవాడ, 07: నేటి మన దేశమ్ ప్రతినిధి** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై రోజు రోజుకు పెనుభారం మోపుతుందని,విచ్చల విడిగా వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతుందని ధరల పెరుగుదలను నిరసిస్తూ ఈ నెల 10వ తేదీన సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరగనున్నాయని వాటిని విజయవంతం చేయాలని,ప్రజల మధ్య,పెట్టుబడి దారుల,కార్మికుల మధ్య,ఉన్నత వర్గాలు,పేద,మధ్యతరగతి వర్గాల మధ్య అంతరాలు లేని సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా,వర్గ రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా కమ్యూనిస్టు శ్రేణులు పనిచేయాలని సిపిఐ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే,సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.వేములవాడలో గత మూడు రోజులుగా జరుగుతున్న కరీంనగర్,పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సిపిఐ కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణా శిబిరాలు నేటితో ముగిశాయి.విప్లవ పార్టీల అవశ్యకత సిపిఐ నిర్మాణం,ప్రజా సంఘాల నిర్మాణంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంత్ రావు,పార్టీ ఎదుర్కొంటున్న సవాళ్లు,అధిగమించే మార్గాలు అనే అంశంపై చాడ వెంకటరెడ్డి బోధించారు.ముగింపుకు ముఖ్య అతిథులుగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలు,గ్యాస్ ధరలు పెరగడం వల్ల ప్రజల జీవనప్రమాణలపై ఆ ప్రభావం పడుతుందని,బీజేపీ నేతలు పదేపదే చెప్పే అచ్చేదిన్ కాదు మీ ప్రభుత్వ నిర్వాకం మూలంగా ప్రజలు సచ్చేదిన్ వస్తుందన్నారు.కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్నుల రాయితీలు ఇస్తూ వారికి కొమ్ముకస్తుందన్నారు.ఈ నేపథ్యంలో అన్ని జిల్లాలలో జరిగే నిరసన ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా సిపిఐ కి గుర్తింపు ఉందని,అన్ని దేశాలలో ఆదరణ ఉందని, ఆయా దేశాల పరిస్థులకు అనుగుణంగా మార్క్సిజాన్ని అనువదించుకొని విప్లవాన్ని సాధించుకోవాలని,కమ్యూనిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేసి,నీతిని అమలు చేయాలని,ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గొప్ప గొప్ప కమ్యూనిస్టు నాయకులు సాహిత్యాన్ని చదవడం వల్లే మేధావులు అయ్యారని,ప్రతీ అంశంపై శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని,బూర్జువా,పెట్టుబడి దారుల పతనమే కమ్యూనిస్టు పార్టీ పంతంగా శ్రేణులు పనిచేయాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్,ఆయా జిల్లాల కార్యదర్శులు పంజాల శ్రీనివాస్,తాండ్ర సదానందం, మంద సుదర్శన్,చెన్న విశ్వనాథం,వేములవాడ నియోజక వర్గ ఇంచార్జీ కడారి రాములు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,గోషిక మోహన్ తదితరులు ఉన్నారు.

## మున్నూరు కాపు సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గా కుందారపు శంకరమ్మ:



**కొమురం ఆసిఫాబాద్, జూన్ 07నేటి మనదేశమ్ ప్రతినిధి):** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన మున్నూరు కాపు సంఘం సమావేశంలో మున్నూరు కాపు సంఘం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన కుందారపు శంకరమ్మ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మున్నూరు కాపు సంఘం బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. మున్నూరు కాపు సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలుగా ఎన్నిక కోసం సహకరించిన కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

# హాస్య సాహిత్యం ప్రజలకు మానసిక ఉల్లాసాన్ని అంధిస్తుంది

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు**
**మైనార్టీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో**
**అఖిల భారతీయ కవి సమ్మేళనం**








**కోరుట్ల, జూన్ 7 ( నేటి మనదేశమ్ ప్రతినిధి** మొహమ్మద్ సాజీద్ అలీ):సమాజంలో ఒత్తిడులు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో హాస్య సాహిత్యం ప్రజలకు మానసిక ఉల్లాసాన్ని అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు.పట్టణంలోని కింగ్స్ గార్డెన్ శనివారం సాయంత్రం మైనార్టీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అఖిల భారతీయ కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కవి సమ్మేళనానికి ప్రముఖ వ్యాపారవేత్త అహ్మద్ అబ్దుల్ నయిమ్, మైనార్టీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్ సిద్ధిఖీ, ప్రధాన కార్యదర్శి మిర్జా మక్రమ్ బేగ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత- గంగాధర్, వైస్ చైర్మన్ సాహెద్ ఉల్ అహద్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ హెచ్ 143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల రాంగోపాల్ హాజరయ్యారు. ఈ కవి సమ్మేళనంలోకవులు అబ్రార్ ఖాషీఫ్, అల్తాఫ్ జీయా, అజార్, కట్ పట్ బాన్సువాడ, టీపీకల్ జగిత్యాలీ, నుజాత్ అమృహి, అంజుమ్ ఊర్జ్, అబ్దుల్ ఫహిమ్ మాజీద్ లుతమ చమత్కార కవిత్వంతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. ఈ కవిత్వాలు సాహిత్యాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూసమాజంలో ఒత్తిడులు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో హాస్య సాహిత్యం ప్రజలకు మానసిక ఉల్లాసాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. హాస్యం మనిషి జీవితంలో ఒక ఔషధంలా పనిచేస్తుందని, సాహిత్య ప్రక్రియల్లో హాస్యానికి ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. యువతలో సాహిత్యాభిరుచిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు సమకాలీన సామాజిక, రాజకీయ, కుటుంబ పరిస్థితులను హాస్యాత్మకంగా ప్రస్తావిస్తూ కవితలు వినిపించారు. వారి చమత్కార పదప్రయోగాలు, వ్యంగ్యోక్తులు, హాస్యభరిత కవితలు సభికులను ఆకట్టుకున్నాయి. కవులు చెప్పిన ప్రతి కవితకు ప్రేక్షకుల నుంచి కరతాళ ధ్వనులు మార్మోగాయి. కొందరు కవులు నేటి సాంకేతిక యుగంలో మనుషుల జీవనశైలిలో వచ్చిన మార్పులను హాస్యరూపంలో చిత్రీకరించగా, మరికొందరు సామాజిక సమస్యలపై వ్యంగ్య కవిత్వాన్ని వినిపించారు. సమ్మేళనం సందర్భంగా యువ కవులకు ప్రత్యేక అవకాశమిచ్చి వారి రచనలను ప్రోత్సహించారు. ఆనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, సామాజికవేత్తలకు,కవులకుముఖ్య అతిథులు శాలువాలతో సన్మానించి,జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల కౌన్సిలర్లు, పాత్రికేయులు, మైనార్టీ సంఘాల నాయకులు, మజీద్, ఈద్గా, ఉర్దూఘర్ కమిటీ సభ్యులు,యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర


మిట్టపల్లి శ్రీనివాసరావు సీనియర్ జర్నలిస్ట్

**జూన్ 07, (నేటి మనదేశమ్):** ఉపాధ్యాయుడు సమాజ నిర్మాణంలో కీలకమైన పాత్ర పోషిస్తాడు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా, మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికత మరియు బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని కూడా నేర్పిస్తాడు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకుడిగా నిలుస్తాడు. ఉపాధ్యాయుడు జ్ఞానాన్ని పంచి, విద్యార్థులను ఉత్తమ పౌరులుగాతీర్చి దిద్దుతాడు. దేశ అభివృద్ధికిఅవసరమైన శాస్త్రవేత్తలు, వైద్యులు,ఇంజనీర్లు, నాయకులు వంటి వారిని తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయుడిదే. అందువల్ల ఉపాధ్యాయుడిని "జాతి నిర్మాత" అని గౌరవిస్తారు. సమాజంలో మంచి ఆలోచనలు, సద్గుణాలు పెంపొందించడంలో ఉపాధ్యాయుని పాత్ర అమూల్యమైనది. ఒక మంచి ఉపాధ్యాయుడు అనేక మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసి, సమాజ పురోగతికి బలమైన పునాది వేస్తాడు. అందుకే ఉపాధ్యాయునికి సమాజంలో ప్రత్యేక స్థానం మరియు గౌరవం లభిస్తుంది.

## పల్లెవెలుగులో ఎక్స్‌ప్రెస్ చార్జీలు




**నారాయణఖేడ్(సంగారెడ్డి): జూన్ 07, (నేటి మనదేశమ్):** ఆర్టీసీ అధికారులు పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి, ప్రయాణికుల నుంచి ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సంగారెడ్డి డిపోకు చెందిన ఒక పల్లెవెలుగు బస్సును మంగళవారం నారాయణఖేడ్ నుంచి లింగంపల్లికి నడపగా, దానికి ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేశారు. నిబంధనల ప్రకారం పల్లెవెలుగు బస్సులను గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే నడపాల్సి ఉండగా, అధికారుల తీరుతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎక్స్‌ప్రెస్ బస్సులో 44 సీట్లు ఉండి ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. కానీ, పల్లెవెలుగులో 55 సీట్లు ఉండి, ప్రయాణానికి అంత సౌకర్యంగా ఉండవు. అయినా, ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేయడం దారుణమని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పల్లె వెలుగు బస్సులను గ్రామీణ ప్రాంతాలకే నడపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి




**జైపూర్, జూన్ 07, (నేటి మనదేశమ్):** : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని డీఎల్‌పీవో ధర్మరాణి పేర్కొన్నారు. గురువారం కాన్కూర్, మిట్టపల్లి, ముదిగుంట, నర్వ, వెంకట్రావుపల్లి గ్రామాల్లో స్వచ్ఛ గావ్ సురక్షిత జలవాయు ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, మరణించిన వారి పేర్లను తొలగించాలని, పేరు, చిరునామాలో తప్పులుంటే బీఎల్‌వోల సహకారంతో సరి చేసుకోవాలన్నారు. ఘన పదార్థాల నిర్వహణలో భాగంగా తడి, పొడి, శానిటరీ ప్రత్యేక వ్యర్థాల కోసం నాలుగు చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకుని సెగ్రిగేషన చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలన్నారు. ప్లాస్టిక్‌ను వాడవద్దని, ఇంకుడుగుంతల వినియోగంపై అవగాహన కల్పించారు. చెత్తను రోడ్లపై వేసినా, కాల్చిన జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ సీఐ నవీనకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఎస్‌ఐ భూమేష్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.కాసిపేట: స్వచ్ఛగావ్‌లో అందరూ భాగస్వాములు కావాలని రొట్టెపల్లి సర్పంచు ఆత్రం కళావతి అన్నారు. గురువారం రొట్టెపల్లిలో స్వచ్ఛగావ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ నిర్వహిస్తూ పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలం, వాయువును పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటిముందు ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసాద్, నాయకులు హన్మంతు, మహిళలు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్-63 పనుల్లో కదలిక




**మంచిర్యాల, జూన్ 07, (నేటి మనదేశమ్):** నిజామాబాద్-జగిత్యాల-మంచిర్యాల జిల్లాల్లో ఎన్‌హెచ్-63 విస్తరణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రహదారి విస్తరణ పనులకు నిధుల విడుదలకు న కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో పనులు పట్టాలెక్కనున్నాయి. ఇప్పటికే ప్రధానమంత్రి కార్యాలయ సూచన మేరకు రోడ్డు నిర్మాణానికి వీలుగా అటవీ, పర్యావరణ అనుమతులు మంజూరుకాగా, కేంద్రం నిధులు కేటాయించడంతో ఇంతకాలం పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం లభించనుంది. ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల, జగిత్యాల-కరీంనగర్ రహదారులు రెండింటికి కలిపి కేంద్రం రూ. 7,597 కోట్లకు ఆమోదం తెలిపింది. రహదారి విస్తరణ పనులకు సంబంధించి ఇప్పటికే మూడుసార్లు అలైన్‌మెంట్‌ను అధికారులు మార్చగా, తమ విలువైన భూములు కోల్పోతున్నామని ఆదినుంచి రైతులు తీవ్రంగా విభేదిస్తున్నారు. జాతీయ రహదారిని విస్తరించేందుకు కేంద్రం గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరిట పనులకు అనుమతులు మంజూరు చేసిన విషయం విదితమే. అయితే పూర్తిగా గ్రీన్ ఫీల్డ్ నిర్మాణానికి అవకాశం లేకపోవడంతో బ్రౌన్‌ఫీల్డ్ కింద ప్రస్తుతం ఉన్న రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మీదుగా జగిత్యాల-మంచిర్యాల వరకు మొత్తం 148.6 కిలీమీటర్ల పొడవున్న 63వ జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు ఎట్టకేలకు అనుమతులు లభించాయి. గతంలో ఉన్న రోడ్డును విస్తరించడంతోపాటు అనుకూలంగా లేనిచోట కొత్తగా నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన భూమిని సేకరించాలని నేషనల్ హైవే అథారిటీని ఆదేశించింది. అధికారులు తయారు చేసిన అలైన్‌మెంట్ ప్రకారం నిజామాబాద్ జిల్లా బాల్కొండలోని ఎన్‌హెచ్-44 నుంచి ప్రారంభమయ్యే రహదారి పలు గ్రామాల గుండా సాగుతూ జగిత్యాల జిల్లాలో ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి రాయపట్నం వద్ద గోదావరి వంతెన మీదుగా జిల్లాలోకి అడుగిడుతుంది. జిల్లాలో గూడెం మీదుగా లక్షెట్టిపేట నుంచి హాజీపూర్, ముల్కల్ల మీదుగా గాంధారి వనం వద్ద ఎన్‌హెచ్-363కి అనుసంధానం చేయనున్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే ఇంతకాలం కష్టాలు పడుతున్న ప్రయాణికుల ఇబ్బందులు తొలగుతాయి.

**రైతుల అభ్యంతరంతో....**ఎన్‌హెచ్-63 కోసం అధికారులు మూడు దఫాలుగా రూట్ మ్యాప్‌లో మార్పులు చేశారు. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం కొందరు బడా బాబులకు నష్టం వాటిల్లుతండటంతో వారి ఒత్తిడికి తలొగ్గి రెండో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. అది లక్షెట్టిపేట నుంచి ముల్కల్ల వరకు పూర్తిగా నివాస గృహాల మీదుగా వెళ్తుంది. దీనివల్ల సామాన్య ప్రజానీకానికి తీరని నష్టం కలిగేలా ఉంది. అష్టకష్టాలు పడి నిర్మించుకున్న ఇళ్లు కూల్చివేతకు గురవుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు సర్వే పనులను అడ్డుకోవడం, భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ పలురకాల ఆందోళనలు నిర్వహించారు. దీనికి స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు మూడో రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. కొత్త అలైన్‌మెంట్‌తో జీవనాధారామైన సాగు భూములను సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ అలైన్‌మెంట్ ప్రకారం లక్షెట్టిపేట మండలం మీదుగా గోదావరి నదికి సమాంతరంగా పంట పొలాలు, చేల మీదుగా రహదారి నిర్మాణం జరగాల్సి ఉంది. గతంలో ఈ ప్రాంత రైతులకు చెందిన భూములు పెద్దఎత్తున శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద ముంపునకు గరయ్యాయి. మిగిలిన కొద్దిపాటి భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మళ్లీ రహదారి నిర్మాణం కోసం తమ భూములు సేకరిస్తుండటంతో వారంతా ఆందోళనబాట పట్టారు. తమకు నష్టం కలిగించే రూట్‌మ్యాప్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించగా, ప్రస్తుతం కేసు పెండింగ్‌లో ఉంది.

**ప్రారంభం కానున్న పనులు....**ఎన్‌హెచ్-63 పనులకు కేంద్రం పచ్చజెండా ఊపడంతో త్వరలో రహదారి విస్తరణ పనులు ప్రారంభం కానున్నాయి. ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల రహదారిని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో విస్తరించేందుకు మార్గం సుగమం అయింది. ఇదిలాఉండగా తమ సమస్యలు పరిష్కరించిన తరువాతనే రహదారి నిర్మాణ పనులు చేపట్టాలనే డిమాండ్‌లు సంబంధిత రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ తమకు నష్టం కలిగించే విధంగా విస్తరణ పనులు చేపడితే అడ్డుకునేందుకు సైతం వెనకాడవద్దనే నిర్ణయానికి బాధిత రైతులు వచ్చినట్లు తెలుస్తోంది. కేంద్రం నిర్ణయించిన మేరకు రహదారి విస్తరణ ఎంత ముఖ్యమో....దాని కింద భూములు కోల్పోతున్న సామాన్య ప్రజలు, రైతుల డిమాండ్లను కూడా పరిగణలోకి తీసుకోవాలనే విజ్ఞప్తులు ఉన్నాయి.

## కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రెడ్ క్రాస్ జీవితకాల సభ్యత్వం స్వీకరణ



**కామారెడ్డి జూన్ 07, (నేటి మనదేశమ్):** కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం భారత రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యత్వాన్ని స్వీకరించారు. ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో రెడ్ క్రాస్ అందిస్తున్న సామాజిక, రక్తదాన సేవలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. సమాజ సేవపై ఆసక్తి ఉన్న అధికారులు, ఉద్యోగులు, ప్రజలు జూన్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకొని జీవితకాల సభ్యులుగా చేరాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఇరుముడి వస్తోందంటే... ప్యారడైజ్ రానట్టా



హఠాత్తుగా ఇరుముడి విడుదల తేదీ ప్రకటించేశారు. ఆగస్ట్ 21 థియేటర్లలో అడుగు పెట్టబోతున్నట్టు మైత్రి మూవీ మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేసింది. మాస్ మహారాజా రవితేజ హీరోగా రూపొందిన ఈ మూవీకి శివ నిర్వాణ దర్శకుడు. అయ్యప్పస్వామి మాలలో రవితేజ చాలా డిఫరెంట్ గా కనిపిస్తుండటంతో అభిమానులు దీని మీద చాలా ఆశలు పెట్టుకున్నారు. ప్రియా భవాని శంకర్ హీరోయిన్ కాగా జివి ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు. ఇక అసలు విషయానికి వద్దాం. ఆగస్ట్ 21 ముందు నుంచి ది ప్యారడైజ్ లాక్ చేసుకున్న డేట్. ఖచ్చితంగా అదే తేదీకి వస్తామని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పదే పదే చెబుతూ వచ్చారు. నాని కూడా ఆ నమ్మకంతోనే ఇంకో సినిమా సెట్లో అడుగుపెట్టకుండా జడలను కొనసాగిస్తూ దీని మీదే ఉన్నాడు. అయితే ఇప్పుడు ఇరుముడి అనౌన్స్ మెంట్ రావడం చూస్తుంటే ప్యారడైజ్ మళ్ళీ వాయిదా పడిందనే ప్రచారానికి బలం చేకూరినట్టే. ఇదే నిజమైతే మటుకు డిసెంబర్ లేదా అటుపై ఏడాదికి వెళ్లాల్సి రావొచ్చు. దీనికి సంబంధించి వీలైనంత త్వరగా ప్యారడైజ్ టీమ్ స్పష్టత ఇవ్వడం అవసరం. ఇప్పటికే రెండు మూడు డేట్లు మారిపోయాయి. హిట్ 3 వచ్చి ఏడాది దాటేసింది. నాని కొత్త మూవీ కోసం ఫ్యాన్స్, మూవీ లవర్స్ ఎదురు చూస్తున్నారు. అందులోనూ ఎన్నడూ చేయని ఒక డిఫరెంట్ షాకింగ్ క్యారెక్టర్ లో నాని విశ్వరూపం చూడొచ్చనే ప్రచారం ముందు నుంచి జరుగుతోంది. అయితే అన్న మాట మీద నిలవలేకపోవడానికి కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు జూన్ నడుస్తోంది. ఇక్కడి నుంచి లెక్కేసుకుంటే ప్యారడైజ్ రిలీజ్ కు కేవలం కొంచెం అటు ఇటుగా డెబ్భై రోజుల సమయం మాత్రమే ఉంది. షూటింగ్ ఇంకా అయిపోలేదు. అనిరుద్ మొత్తం ఆల్బమ్ ఇచ్చాడో లేదో తెలియదు. పైగా రీ రికార్డింగ్ కి ఎక్కువ సమయం కావాలి. ప్రమోషన్లకు ఓ రెండు వారాలు కంపల్సరి. ఇంత టైట్ షెడ్యూల్ లో ప్యారడైజ్ కొత్త అనుమానాలు లేవనెత్తుతోంది. ఇలా అయితే న్యాచురల్ స్టార్ అభిమానులు ఇంకొంత కాలం వెయిట్ చేయక తప్పదేమో.




## కమల్ క్లాసులో ఆలోచించాల్సిన విషయాలు



లోక నాయకుడు కమల్ హాసన్ చాలా సందర్భాల్లో ఉన్నది ఉన్నట్టు చెప్పేస్తారు. భవిష్యత్తుని కూడా చక్కగా అంచనా వేస్తారు. విశ్వరూపం సినిమా వివాదంలో చిక్కుకుని థియేటర్ రిలీజ్ కాక ప్రభుత్వం అడ్డుపడినప్పుడు డిటిహెచ్ ద్వారా నేరుగా ఇంటికే వచ్చేలా చేస్తానని చెప్పడం అప్పట్లో దుమారం రేపింది. డిస్ట్రిబ్యూటర్లు దుమ్మెత్తి పోశారు. కట్ చేస్తే కరోనా నుంచి ఇప్పటిదాకా ఎన్ని సినిమాలు డైరెక్ట్ ఓటిటి రిలీజ్ జరుపుకున్నాయో లెక్క చెప్పడం కష్టం. అలాంటి విజన్ కమల్ స్వంతం. ఇవాళ సింగ్ గీతం ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. కమల్ హాసన్ అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పుడు సినిమాలు తీయడం కేవలం బిజినెస్ గా మారిపోయిందని, ప్యాషన్ పక్కనపెట్టేసి వంద, రెండు వందల కోట్లు, మూడు వందల కోట్లు అని లెక్కేలేసుకుంటూ తీసే దర్శక నిర్మాతలు పెరిగిపోయారని చురక వేశారు. పుష్పక విమానం కేవలం పదిహేను లక్షలతో తీస్తే ఇప్పటి లెక్కల్లో అది రెండు వందల కోట్లతో సమానమయ్యే కంటెంట్ గా నిలిచిందని గుర్తు చేశారు. ఆయన అన్నది అక్షరాలా నిజం. ఎలివేషన్ల మత్తులో, ప్యాన్ ఇండియా ఉచ్చులో పడిపోయి బాలీవుడ్ నుంచి టాలీవుడ్ దాకా అందరూ ఇదే బాట పట్టారు. పాతిక కోట్ల మార్కెట్ లేని హీరో కూడా నాకు వరల్డ్ బిల్డింగ్ కథ కావాలని డిమాండ్ చేస్తున్నాడు. దర్శకులు సైతం పోటీ పడి మరీ అలాంటివే రాస్తున్నారు. దాంతో తక్కువ బడ్జెట్ లో క్వాలిటీ కంటెంట్లు స్టార్ హీరోల నుంచి రావడం లేదు. ఇదే కమల్ స్వాతిముత్యంకు అయిన ఖర్చు ఎంత. వచ్చిన ఆదాయంతో కేవలం పది శాతం ఉంటుంది. కమల్ చెప్పినంత మాత్రాన ఇప్పటికిప్పుడు ఏదో మార్పులు వచ్చేస్తాయని కాదు కానీ ఆలోచించడం అయితే అవసరమే. సింగ్ గీతం జూన్ 11 విడుదల కానుంది. తనకు పుష్పక విమానం, విచిత్ర సోదరులు, మైఖేల్ మదన కామరాజు లాంటి ఎవర్ గ్రీన్ క్లాసిక్స్ ఇచ్చిన సింగీతం శ్రీనివాసరావు గారి మీద అభిమానంతో కమల్ ఈ వేడుకకు హాజరయ్యారు . 94 వయసులోనూ సింగీతం గారు చలాకీగా కనిపించడమే కాదు ఎందరికో స్ఫూర్తినిచ్చేలా సింగ్ గీతం తీశారు

## దత్తుగారికి నిద్ర పట్టనివ్వని మెగా మూవీ





టాలీవుడ్ అగ్ర నిర్మాత సి అశ్వినీదత్ ఇవాళ ఎమోషనల్ అయ్యారు. సింగ్ గీతం ప్రీ రిలీజ్ ఈవెంట్ లో మాట్లాడుతూ పాతిక సంవత్సరాల క్రితం సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో ఒక సినిమా మొదలుపెట్టాక మధ్యలో ఆగిపోయిందని, అప్పటి నుంచి సరిగా నిద్ర పట్టలేదని, ఆ కొరతను నాగ్ అశ్విన్ -- స్వప్న -- ప్రియాంకలు తీర్చారని, అందుకే ఈ రోజు చాలా సంతోషంగా ఉన్నానని చెప్పుకొచ్చారు. పేరు చెప్పలేదు ఆ మెగా మూవీ వెనుకో ఫ్లాష్ బ్యాక్ ఉంది. 1996 తర్వాత చిరంజీవి హీరోగా సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వైజయంతి మూవీస్ బ్యానర్ మీద అశ్వినిదత్ 'భూలోక వీరుడు' అనే భారీ చిత్రాన్ని అనౌన్స్ చేశారు. హీరోయిన్ గా టబుని ఎంచుకున్నారు. ఇళయరాజాతో పాట రికార్డింగ్ కూడా అయ్యింది. కొన్ని ఎపిసోడ్ల చిత్రీకరణ జరిగింది. ఏమైందో ఏమో కానీ హఠాత్తుగా ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. చిరు -- సింగీతం కాంబోని తెరమీద చూడాలని తహతహలాడిన మూవీ లవర్స్ తీవ్రంగా నిరాశ చెందారు. ఆ తర్వాత వేరే కథతో రామ్ గోపాల్ వర్మ డైరెక్షన్ లో చిరంజీవితోనే ఇంకో మూవీ ప్లాన్ చేశారు దత్తు గారు. అది కూడా అచ్చంగా పైన చెప్పినట్టే ఒక షెడ్యూల్ తర్వాత ఆగిపోయింది. కట్ చేస్తే సీన్ లోకి గుణశేఖర్ ఎంటర్ కావడం, చూడాలని ఉంది సబ్జెక్టుతో మెప్పించడం, మెగాస్టార్ కు బ్లాక్ బస్టర్ ఇవ్వడం జరిగిపోయాయి. అంత జరిగాక మళ్ళీ ఎప్పుడైనా చిరంజీవి -- సింగీతం కలయిక జరుగుతుందేమోనని ఫ్యాన్స్ ఎదురు చూశారు కానీ అది కలగానే ఉండిపోయింది. సో అశ్వినిదత్తుని నిద్ర పట్టనివ్వకుండా చేసిన సినిమా వెనుక ఇంత కథ ఉంది. బాలయ్యతో భైరవద్వీపం, ఆదిత్య 369, శ్రీ కృష్ణార్జున విజయం లాంటి క్లాసిక్స్ తీసిన సింగీతం శ్రీనివాసరావు గారు నాగార్జునతో ఆకాశవీధిలో చేశారు. చిరంజీవి, వెంకటేష్ తో మాత్రం సాధ్యపడలేదు. సింగ్ గీతంని పర్యవేక్షిస్తున్న నాగ్ అశ్విన్ అన్ని తానై ప్రమోషన్లు చూసుకుంటున్నారు. తొంభై నాలుగేళ్ళ వయసులో సింగీతం శ్రీనివాసరావుగారు తెరమీద ఎలాంటి మేజిక్ చేయబోతున్నారో చూడాలి.

## సాయిపల్లవి వదులుకుంటే సమంత అందుకుంది



19 మా ఇంటి బంగారం విడుదలకు రెడీ అవుతోంది. శాకుంతలం, ఖుషి తర్వాత సమంతకు బాగా గ్యాప్ వచ్చేసింది. తనే నిర్మించిన శుభంలో చిన్న క్యామియో చేసినప్పటికీ అదేమంత పనవ్వలేదు. ఈసారి ఆశలన్నీ మా ఇంటి బంగారం మీదే పెట్టుకుంది. టైటిల్ రోల్ తనదే. నిర్మాత కూడా ఆమె. రాజ్ నిడిమోరుతో పెళ్ళయాక ఇద్దరి ప్రొడక్షన్ లో వస్తున్న తొలి మూవీ ఇదే కావడంతో చాలా స్పెషల్ గా ఫీలవుతోంది. కొంచెం పెద్ది హడావిడి తగ్గాక ప్రమోషన్ల వేగం పెంచబోతున్నారు. ఈ సందర్భంగా ఆన్ లైన్ లో తన అభిమానులతో ముచ్చటించిన సమంత ఒక కీలక విషయాన్ని పంచుకుంది. మా ఇంటి బంగారం ముందు సాయిపల్లవి కోసం అనుకున్నారట. ఆ మేరకు సబ్జెక్టు రెడీ చేసి ట్రై చేస్తే డేట్స్ సమస్య వల్ల ఆమె చేయడం సాధ్యపడదని అర్థమైపోయి, ఆ తర్వాత సామ్ కు తగ్గట్టు కొన్ని మార్పులు చేసి ఫైనల్ టచప్ ఇచ్చారు. ఇదంతా స్వయంగా సమంతనే చెప్పడంతో నిజం బయటపడింది. ఒకవేళ సాయిపల్లవి ఒప్పుకుని ఉంటే బజ్ ఎలా ఉండేదో. లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందిన మా ఇంటి బంగారం సమంత, సాయిపల్లవి ఇద్దరిలో ఎవరు చేసినా మేజర్ బ్రేక్ త్రూ అయ్యేదేమో. ఇమేజ్ పరంగా ఇద్దరినీ ఒకే గాటన కట్టలేం కానీ పెర్ఫార్మన్స్ కు ప్రాధాన్యం ఇచ్చే వాళ్ళు ఒకరైతే, నటనతో పాటు అవసరానికి తగ్గట్టు కమర్షియల్ రోల్స్ ఎంచుకోవడం మరొకరి స్టయిల్. సో తెరమీద చూసే దాకా ఎవరు రైట్ ఎవరు రైట్ ఎవరు రాంగ్ అనేది చెప్పలేం. కాకపోతే సాయిపల్లవికి కొంచెం ఎక్కువ ఎడ్జ్ వచ్చేదేమో.



# బిజినెస్ న్యూస్



## మ్యాక్సీ స్కూటర్లకు పెరుగుతున్న పోటీ.. టీవీఎస్ కూడా రెడీ



స్కూటర్.. అంటే ఒకప్పుడు ఫ్యామిలీ టూవీలర్ మాత్రమే. ఇటీవల కాలంలో వీటి రూపు మారుతోంది. సామర్థ్యమూ పెరుగుతోంది. కుర్రకారును ఆకట్టుకోవడానికి కంపెనీలు స్టైలిష్ లుక్‌లో పవర్‌ఫుల్ ఇంజిన్‌తో మ్యాక్సీ స్కూటర్లను లాంచ్ చేస్తున్నాయి. ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే యమహా ఏరోక్స్ 155, హీరో జూమ్ 160 మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. త్వరలో హోండా కూడా ~ాణం160 పేరిట కొత్త స్కూటర్‌ను లాంచ్ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. దీంతో ప్రీమియం స్కూటర్ సెగ్మెంట్‌లో గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉంది. ప్రస్తుతం టీవీఎస్ కంపెనీ జూపిటర్, ఎన్‌టార్క్ పేరిట స్కూటర్లను విక్రయిస్తోంది. ఇందులో స్పోర్టీ లుక్‌లో ఉండే ఎన్‌టార్క్ కుర్రకారును ఆకట్టుకుంటోంది. దీంతో ఎన్‌టార్క్ 150 సీసీని సైతం కంపెనీ లాంచ్ చేసింది. ఇప్పుడు మరింత పవర్‌ఫుల్ ఇంజిన్‌తో 160 సీసీ మ్యాక్సీ స్కూటర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్కూటర్‌ను పూర్తి కొత్త ప్లాట్‌ఫామ్‌పై రూపొందుతున్నట్లు సమాచారం. లిక్విడ్ కూల్డ్ ఇంజిన్‌తో టీవీఎస్ పోర్ట్‌ఫోలియోలోనే అత్యంత అధునాతన స్కూటర్‌గా కాబోతోందని తెలుస్తోంది. యమహా ఏరోక్స్ 155, హీరో జూమ్‌కు పోటీగా ఇదే సామర్థ్యంలో టీవీఎస్ మ్యాక్సీ స్కూటర్ రాబోతోందని తెలుస్తోంది. అధిక వీల్ బేస్, బ్లూటూత్ కనెక్టివిటీ, నావిగేషన్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, డిస్క్ బ్రేక్స్‌తో వచ్చే ఏడాది లాంచ్ కాబోతోందని సమాచారం.

## కస్టమర్ల కోసం టీవీఎస్ కొత్త కాన్సెప్ట్!



భారతదేశంలోని ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ అయిన టీవీఎస్ మోటార్ కంపెనీ 'టీవీఎస్ ప్యాడాక్' అనే కొత్త ప్రీమియం రిటైల్ నెట్‌వర్క్‌ను ప్రారంభించింది. ప్రీమియం మోటార్‌సైకిల్ విభాగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కంపెనీ దీనిని స్టార్ట్ చేసింది. టీవీఎస్ ప్యాడాక్ ద్వారా వినియోగదారులు సాధారణ షోరూమ్ కంటే మంచి ఎక్స్‌పీరియన్స్ పొందవచ్చు. ఈ ప్రీమియం అవుట్‌లెట్లను లండన్‌కు చెందిన చెక్‌ల్యాండ్ కిండ్లీసైడ్స్ సంస్థ రూపొందించింది. ఇందులో కొత్త ప్రీమియం బైకుల ప్రదర్శన ఉంటుంది. అంతే కాకుండా.. వినియోగదారులకు ప్రత్యేక సలహాలు ఇచ్చే కన్సల్టేషన్ జోన్లు, బ్రాండ్‌కు సంబంధించిన మెర్చండైజ్ వస్తువులు, సర్వీస్ సదుపాయాలు అన్నీ అందుబాటులో ఉంటాయి. అయితే.. తొలి టీవీఎస్ ప్యాడాక్ అవుట్‌లెట్లు 2027 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో ప్రారంభమవుతాయని కంపెనీ వెల్లడించింది. ఆ తరువాత దశలవారీగా వీటిని దేశం మొత్తం విస్తరించే అవకాశం ఉంది.

## వెండికి తప్పనిసరి హాల్‌మార్కింగ్ ఎలా?



వెండి ఆభరణాలకూ తప్పనిసరి హాల్‌మార్కింగ్ అమలు చేసేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు దేశీయంగా ఉన్నాయా.. నిబంధనావళి ఎలా ఉండాలి.. అనే అంశాన్ని భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) పరిశీలిస్తోంది. 2005 నుంచే వెండికి హాల్‌మార్కింగ్ స్వచ్ఛందంగా అమల్లో ఉండగా, 2025 సెప్టెంబరు నుంచి వీటిపై హాల్‌మార్క్ యునీక్ ఐడెంటిఫికేషన్ (హెచ్‌యూఐడీ) సంఖ్య ముద్రిస్తున్నట్లు బీఐఎస్ డైరెక్టర్ జనరల్ సంజయ్ గార్గ్ చెప్పారు. మారుమూల ప్రాంతాల్లోని చిన్న దుకాణాల్లోనూ వెండి ఆభరణాలు విక్రయిస్తున్న దశలో.. వీటికి హాల్‌మార్క్ అమలు చేయడం సవాలుతో కూడుకున్నదని వివరించారు. బీఐఎస్‌లో హాల్‌మార్క్ ప్రక్రియను అయిదుగురు మాత్రమే పర్యవేక్షిస్తున్నారని, మిగిలినవారు ప్రైవేటు/అవుట్ సోర్సింగ్ వ్యక్తులని వెల్లడించారు. అందుకే వెండికి తప్పనిసరి హాల్‌మార్కింగ్ అమలు చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులు పరిశీలించి, తప్పులు జరగకుండా వ్యవహరించేందుకు నిబంధనావళి రూపొందిస్తున్నట్లు చెప్పారు. 2024-25లో 32 లక్షల వెండి ఆభరణాలకు హాల్‌మార్క్ వేయగా, 2025-26లో ఈ సంఖ్య 59 లక్షలకు పెరిగినట్లు తెలిపారు.

## కొత్త టెక్నాలజీ.. డైలీ రొటీన్‌కు ఫన్ టచ్!



రోజూ వాడే చిన్న చిన్న వస్తువులే ఇప్పుడు స్మార్ట్‌గా మారిపోతున్నాయి. చూడటానికి క్యూట్‌గా, వాడటానికి సూపర్‌గా ఉండే ఈ స్మార్ట్ హెల్పర్స్‌తో మీ డైలీ రొటీన్‌కు ఒక ఫన్ టచ్ వచ్చేస్తుంది!

స్పూన్‌తో పనిలేని మగ్!

ఉదయాన్నే ఆఫీస్ హడావుడిలో కాఫీ లేదా హెల్తీ ప్రొటీన్ షేక్ కలుపుకోవడానికి స్పూన్ వెతుక్కునే ఓపిక లేనప్పుడు-- మీ పనిని చిటికెలో సులువు చేయడానికే వచ్చేసింది ఈ 'ఆటోమేటిక్ సెల్ఫ్ స్టిరింగ్ మగ్!' ఇది మీ చేతిలో ఉంటే చాలు, మీరు స్పూన్‌తో తిప్పాల్సిన అవసరం లేకుండా కేవలం ఒకే ఒక్క బటన్ ప్రెస్‌తో మీ డ్రింక్‌ని పర్ఫెక్ట్‌గా మిక్స్ చేసేస్తుంది. ఇందులో ఉండే అడ్వాన్స్డ్ మ్యాగ్నెటిక్ మిక్సింగ్ టెక్నాలజీ వల్ల అడుగున షుగర్ గానీ, ప్రొటీన్ పౌడర్ గానీ గడ్డలు కట్టకుండా స్మూత్‌గా బ్లెండ్ అవుతుంది. థర్మల్ లిడ్ డిజైన్‌తో రావడం వల్ల మీ డ్రింక్ ఎక్కువసేపు వేడిగా ఉంటుంది, పైగా ప్రయాణాల్లో వాడుతున్నా కూడా అస్సలు కింద వలకదు. ధర కేవలం రూ. 1000 మాత్రమే!

మినీ ఎయిర్ పంప్...!

సమ్మర్ క్యాంపింగ్‌కి వెళ్లినప్పుడు లేదా పూల్‌లో ఎంజాయ్ చేయాలనుకున్నప్పుడు ఎయిర్ బెడ్స్, స్విమ్ రింగ్స్‌లో నోటితో గాలి ఊదలేక ప్రాణం, ప్రాణం మీదికి వస్తోందా? మీ ఊపిరితిత్తుల కష్టాలను తీరుస్తూ, చిటికెలో గాలి నింపేయడానికి వచ్చేసింది ఈ 'ఫ్లెక్స్‌టైల్‌గేర్ మ్యాక్స్ పంప్'.

కేవలం 123 గ్రాముల బరువుండే ఈ బుజ్జి గ్యాడ్జెట్.. ఏకంగా 5.0 కెపీఏ ప్రెజర్‌తో నిమిషానికి 500 లీటర్ల గాలిని రాకెట్ స్పీడ్‌తో నింపేస్తుంది. దీని డిజైన్‌కు అంతర్జాతీయ అవార్డు కూడా వచ్చింది. ఎందుకంటే దీని లోపలి భాగాలు కనిపించేలా ట్రాన్స్‌పరెంట్ బాడీతో ఉండటమే కాకుండా, రాత్రి పూట క్యాంపింగ్‌లో వాడుకోవడానికి వీలుగా 3 లెవెల్స్ బ్రైట్‌నెస్ ఉన్న ఒక సూపర్ ఎల్‌ఈడీ క్యాంపింగ్ లైట్‌లా కూడా పనిచేస్తుంది. ఒకసారి చార్జ్ చేస్తే 60 నిమిషాల పాటు నాన్ స్టాప్‌గా చేస్తుంది. ధర రూ. ఐదు వేల నుంచి మొదలు!

చార్జర్ ప్రొటెక్టర్!

మీ చార్జర్ కేబుల్స్ త్వరగా విరిగిపోతున్నాయా? లేదా వైట్ కలర్ అడాప్టర్ మురికిగా అయిపోతోందని వర్రీ అవుతున్నారా? మీ చార్జర్‌ని సరికొత్తగా మారుస్తూ, దానికి లైఫ్ లాంగ్ ప్రొటెక్షన్ ఇవ్వడానికి వచ్చేసింది ఈ 'ఆస్ట్రోనాట్ థీమ్ చార్జర్ ప్రొటెక్టర్ సెట్!'

ఇది చార్జర్, పవర్ అడాప్టర్లకు పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యే ఒక క్యూట్ గ్యాడ్జెట్. హై--క్వాలిటీ సిలికాన్ మెటీరియల్‌తో చేసిన ఈ కేస్, మీ చార్జింగ్ బ్రిక్‌ను స్క్రాచెస్ పడకుండా, కింద పడినా పాడవకుండా కాపాడుతుంది. ఇందులో వచ్చే బ్లాక్ అండ్ వైట్ స్పైరల్ ర్యాప్ మీ కేబుల్స్ అస్సలు వంగిపోకుండా, చిరిగిపోకుండా రక్షణ ఇస్తుంది. అంతేకాదు, ట్రావెలింగ్‌లో కేబుల్స్ చిక్కుపడిపోకుండా నీట్‌గా ఫోల్డ్ చేసుకోవడానికి ఇందులో ఒక ఆర్గనైజింగ్ స్ట్రాప్ కూడా వస్తుంది. దీని ధర రూ. 170 మాత్రమే!

# ఎల్.కోటలో 'స్వచ్ఛ రథం' వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి





**కొత్తవలస నేటి మనదేశమ్ ప్రతినిధి :** గ్రామాలను పారిశుధ్య రహితంగా, సంపూర్ణ పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ రథం ప్రత్యేక వాహనాన్ని ఎల్.కోట మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. 'వ్యర్థాలివ్వండి.. నిత్యావసరాలు తీసుకోండి' అనే వినూత్న నినాదంతో ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ రథం వాహనానికి ప్రజలు తమ ఇళ్లలోని పనికిరాని ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, గాజు సీసాలు, పాత పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, నూనె డబ్బాలు, ఇనుము, స్టీల్, అల్యూమినియం వస్తువులతో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను అందజేయవచ్చు. గ్రామస్థులు సేకరించి ఇచ్చిన ఈ వ్యర్థాలను అక్కడికక్కడే తూకం వేసి, అందుకు సమానమైన నగదును లెక్కగట్టి, ఆ విలువకు సరిపడా నిత్యావసర సరకులను తక్షణమే అందిస్తారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ.. ఈ స్వచ్ఛ రథం వాహనంలో సబ్బులు, టూత్‌పేస్టులు, ఉల్లిపాయలు వంటి సుమారు 20 రకాల రోజువారీ నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి వాహనం వెవస్తుందని.. గ్రామస్థులు ఈ అవకావాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ వినూత్న విధానం వల్ల ఒకవైపు గ్రామాల్లో వ్యర్థాలు తొలగిపోయి పరిసరాలు అత్యంత పరిశుభ్రంగా మారుతుండగా, మరోవైపు ప్రజలకు తమ ఇంటి వద్దే వ్యర్థాల ద్వారా నిత్యావసర వస్తువులు లభించే సువర్ణావకాశం కలుగుతోంది. అదేవిధంగా ఈ వాహనాన్ని నడిపే స్థానిక వాహనదారుడికి సైతం చక్కటి ఉపాధి లభిస్తుందని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ాావీజ చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కరెడ్ల ఈశ్వరరావు, ాావీజ డైరెక్టర్ పుట్టా శ్రీనివాసరావు, ఎస్ కోట మండల పార్టీ అధ్యక్షుడు డోకుల అచ్చం నాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామ కృష్ణ, ముచకర్ల పవన్, కూటమి నాయకులు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# యుక్త వయసులో పెరుగుతున్న బ్రెయిన్ ట్యూమర్లు

- ముందస్తు గుర్తింపుతో నయం చేయవచ్చు
- జీవనశైలి మార్పులతో ఇబ్బందులు
- కిమ్స్ ఐకాన్ లో అత్యాధునిక సాంకేతికతలు



డా. కె. అచ్చయ్య నాయుడు కన్సల్టెంట్ న్యూరోసర్జన్, కిమ్స్ ఐకాన్, విశాఖపట్నం.

**విశాఖపట్నం, జూన్ 07 (నేటి మనదేశమ్)** :మెదడు ఇది శరీరంలోని అత్యంత సున్నితమైన ప్రాంతం. చిన్న తలనొప్పి వచ్చినా... మనం తట్టుకోలేము. అలాంటి సున్నితమైన ప్రదేశంలో ట్యూమర్లు(కణితులు) ఏర్పడి ప్రాణాలకే ఆటకం ఏర్పడే దిశగా వెళ్తుంటాయి. మెదడులో వచ్చే కణితులపై ప్రతి ఒక్కరికీ కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలి. తరచూ లేదా తీవ్రమైన తలనొప్పి, వాంతులు, మూర్ఛలు, చూపు మందగించడం, చేతులు లేదా కాళ్లలో బలహీనత, మాట్లాడటంలో ఇబ్బంది, జ్ఞాపకశక్తి సమస్యలు, వ్యక్తిత్వం లేదా ప్రవర్తనలో మార్పులు వంటి లక్షణాలు మెదడు కణితులకు సంకేతాలుగా ఉండవచ్చు. ఈ లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం అవసరం. మెదడు కణితులు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఎవరికైనా వచ్చే అవకాశం ఉంది. చాలా సందర్భాల్లో కణితులు ఏర్పడటానికి ఖచ్చితమైన కారణాలు తెలియకపోయినా, వైద్య పరిశోధనలు కొత్త చికిత్సా విధానాలను అభివృద్ధి చేస్తున్నాయి. కణితి రకం, పరిమాణం, ఉన్న ప్రదేశాన్ని బట్టి చికిత్స మారుతుంది. శస్త్రచికిత్స, రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ లేదా వీటి సమ్మేళనంతో చికిత్స అందిస్తారు. ఆధునిక సాంకేతికతతో ప్రస్తుతం శస్త్ర చికిత్సలు మరింత సురక్షితంగా, కచ్చితత్వంతో నిర్వహించగలుగుతున్నారు. నాడీ సంబంధిత సమస్యలు, తరచూ తలనొప్పులు లేదా అసాధారణ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి. అవగాహన, ముందస్తు నిర్ధారణ, అత్యాధునిక చికిత్సల ద్వారా అనేక మంది రోగుల ప్రాణాలను కాపాడవచ్చు.

# జీర్ణాశయ, కాలేయ సమస్యలు పెరుగుతున్నాయి

## - డా. చలపతిరావు ఆచంట

- కిమ్స్ హాస్పిటల్స్ సీతమ్మధార ఆధ్వర్యంలో జాతీయ సదస్సు
- దేశం నలుమూలల నుండి హాజరైన నిపుణులు
- యువ వైద్యులకు ఈ సదస్సులు ఎంతో కీలకం
- విజయవంతంగా 'గ్యాస్ట్రో అప్‌డేట్ - 4వ ఎడిషన్'



**విశాఖపట్నం, జూన్ 07 (నేటి మనదేశమ్) :** మారుతున్న జీవనశైలిలో భాగంగా జీర్ణాశయ, కాలేయం (లివర్) సమస్యలు పెరుతున్నాయన్నారు సీనియర్ కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, సదస్సు నిర్వహణ కమిటీ చైర్మన్ డా. చలపతిరావు ఆచంట. కిమ్స్ హాస్పిటల్స్, సీతమ్మధారలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ గ్యాస్ట్రో సైన్సెస్ ఆధ్వర్యంలో, అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా (ఏపీఐ), ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), వైజాగ్ గట్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి వైద్య విద్యా సదస్సు 'గ్యాస్ట్రో అప్‌డేట్ -4వ ఎడిషన్' ఆదివారం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా డా. చలపతిరావు మాట్లాడారు . జీర్ణాశయ, కాలేయ వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో ఎదురయ్యే క్లిష్టమైన వైద్య పరిస్థితులపై చర్చించేందుకు దేశంలోని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు, వైద్యులు, పీజీ విద్యార్థులు, ఆరోగ్య రంగ నిపుణులు ఈ సదస్సుకు హాజరయ్యారు. దేశంలో జీర్ణాశయ, కాలేయ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. క్లిష్టమైన కేసులపై జరిగే అకడమిక్ చర్చలు వైద్యుల నిర్ధారణ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రోగులకు మెరుగైన చికిత్స అందించడంలో కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అంతేకాకుండా యువ వైద్యులకు ఇలాంటి సదస్సులు ఎంతో కీలకమన్నారు. ఇక్కడ జరిగే సంక్లిష్ట కేసుల వివరణతో యువ వైద్యులు మెలుకువలు నేర్చుకోవచ్చన్నారు. అలాగే ఈ విభాగంలో వస్తున్న కొత్త టెక్నాలజీ చికిత్సలు కూడా పరిచయమవుతాయన్నారు.

ఈ సదస్సులో న్యూఢిల్లీ, ముంబై, హైదరాబాద్, భువనేశ్వర్, అహ్మదాబాద్ నగరాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారు. మింగుడుపడకపోవడం (డిస్‌ఫాజియా), చికిత్సకు లొంగని అజీర్ణం, మళ్లీ మళ్లీ వచ్చే కామెర్లు, దీర్ఘకాలిక విరేచనాలు, కాలేయ క్యాన్సర్లు, క్లిష్టమైన గ్యాస్ట్రోఈసోఫేజియల్ రిఫ్లక్స్ వ్యాధి, పునరావృతమయ్యే పెరియానల్ ఫిస్టులా, తీవ్రమైన ప్యాంక్రియాటైటిస్ సమస్యలు, పునరావృతమయ్యే జీర్ణాశయ రక్తస్రావం వంటి అనేక క్లిష్ట అంశాలపై నిపుణులు చర్చించారు. రోగుల కేసులను ఆధారంగా చేసుకుని నిర్వహించిన ఇంటరాక్టివ్ కేస్-బేస్డ్ సెషన్లు సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతీయ, ప్రాంతీయ నిపుణులు కలిసి కేసులను విశ్లేషిస్తూ ఆధునిక నిర్ధారణ పద్ధతులు, చికిత్సా విధానాలపై విలువైన సూచనలు అందించారు. కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఈవో డాక్టర్ అభినయ్, రీజినల్ సీఈవో డాక్టర్ నాగేష్ మాట్లాడుతూ సదస్సు విజయవంతానికి సహకరించిన అధ్యాపకులు, ప్రతినిధులు, భాగస్వామ్య సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నం గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ రంగాల్లో వైద్య విద్య, పరిశోధన, అధునాతన శిక్షణకు ముఖ్య కేంద్రంగా ఎదుగుతున్నదనే విషయాన్ని ఈ సదస్సుకు లభించిన విశేష స్పందన మరోసారి నిరూపించిందన్నారు.

# విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రి మృతి



**కొత్తవలస నేటి మన దేశం ప్రతినిధి :-** కొత్తవలస మండలం బలుగోటం గ్రామంలో విద్యుత్ షాక్ తో తాపీ మేస్త్రి మృతి చెందినట్లు కొత్తవలస సీఐ విజయ్ కుమార్ తెలిపారు కుటుంబీకుల తెలిపిన వివరాల ప్రకారంగా కొత్తవలస మేజర్ గ్రామపంచాయతీ మింది వలస గ్రామానికి చెందిన కోరుబిల్లి బండి రాజు , ప్రతిరోజు లనే ఆరవ తారీఖున బలిఘట్టం గ్రామంలో గల ఆదిరెడ్డి చిన్న దేవుడు బిల్డింగ్ పనుల నిమిత్తం వెళ్లి ప్లాన్ వేస్తుండగా మధ్యాహ్నం సుమారు 12 గంటల 30 నిమిషాల నుండి ఒంటి గంట మధ్యలో బిల్డింగ్ పక్కగా ఉన్న విద్యుత్ వైర్లు ప్రమాదవశాత్తు తగులటంతో తన తమ్ముడు సంఘటనా స్థలం లోనే మరణించినట్లుగా మృతుని అన్నయ్య కోరుబిల్లి శ్రీను కొత్తవలస పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు కేసు నమోదు చేసుకున్న కొత్తవలస సీఐ విజయ్ కుమార్ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

# పరిశ్రమల అనుమతులన్నీ

## గడువు లోపలే మంజూరు చేయాలి : జిల్లా కలెక్టర్



**విజయనగరం, జూన్ 07 (నేటి మనదేశమ్) :** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులకు గడువులోగా అన్ని రకాల అనుమతులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మార్చి నెల నుండి నేటి వరకు సింగిల్ డెస్క్ పాలసీ కింద అందిన దరఖాస్తుల పై సమీక్షించారు. మార్చి నుండి జూన్ వరకు 772 దరఖాస్తులు అందగా 752 దరఖారులకు ఆమోదం ఇవ్వడం జరిగిందని అన్నారు. అన్ని దరఖాస్తులను గడువు లోగానే పరిష్కరించడం జరిగిందని, 5 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని తెలిపారు. భూగర్భజల శాఖ వద్ద ఒక దరఖాస్తు, పి.సి.బి వద్ద 12, ఫ్యాక్టరీలు వద్ద 2 దర ఖాస్తులు పెండింగ్ ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కరుణాకర్, ఎల్.డి.ఎం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహిళలకు 33% రిజర్వేషన్ల విషయమై మాట తప్పిన నారా లోకేష్

## రాజ్యసభకు ఒక్క మహిళను కూడా ఎంపిక చేయకపోవడం దారుణం

- ఇప్పటికే స్పీకర్ గా ఉన్న అయ్యన్నపాత్రుడి కుమారుడికి రాజ్యసభ స్థానం ఎందుకు?
- నారా లోకేష్ అనాలోచిత నిర్ణయాలు వల్ల భవిష్యత్తులో పార్టీ మనుగడకే ప్రస్నార్థకం
- జూనియర్ ఎన్టీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాల్సిన సమయం ఆసన్నమైంది
- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ సంచలన వ్యాఖ్యలు



**విశాఖపట్నం, జూన్ 07 (నేటి మనదేశమ్)** :మహిళలకు 33% రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన తెలుగు దేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ కేవలం తొమ్మిది రోజుల్లోనే మాట తప్పారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఆరోపించారు. ఆదివారం ఉదయం జీవీఎంసీ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆయన మీడియాతో ఇదే విషయమై మాట్లాడుతూ.. రాజ్యసభకు నాలుగు స్థానాలు కేటాయించాల్సి ఉండగా ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించారన్నారు. మిగిలిన మూడు స్థానాలలో తెలుగు దేశం పార్టీకి చెందిన అగ్రవర్ణ వ్యక్తులకే సీట్లు కేటాయించడం దారుణం అని వ్యాఖ్యనించారు. తమకు 33% రిజర్వేషన్ అని లోకేష్ ప్రకటించిన వెంటనే అతని ఫోటోలకు క్షీరాభిషేకాలు చేసిన మహిళలు ఇప్పుడు లోకేష్ వైఖరిపై ఎలా స్పందిస్తారో చూడాలన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ గా ఉన్న చింతకాయల అయ్యన్నపాత్రుడి కుమారుడికి సీటు కేటాయింపు పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మొత్తం మీద చూసినట్లయితే కేవలం లోకేష్ టీమ్ కే చెందిన ముగ్గురే వ్యక్తులకు రాజ్యసభ సీట్లు కేటాయించడం బట్టి పార్టీలో చంద్రబాబు నాయుడు టీమ్ ప్రాబల్యం తగ్గుతున్నట్టు స్పష్టంగా అర్థమవుతున్నదని పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా ఉన్న నారా లోకేష్ అనాలోచిత నిర్ణయాలు భవిష్యత్తులో ఆ పార్టీ మనుగడకే ప్రస్నార్థకం చేస్తాయని హెచ్చరించారు. గతంలో తెలంగాణలో తెలుగు దేశం పార్టీ పతనం కావడానికి లోకేష్ కారణమని ఆరోపిం చారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్లో కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని.. ఈ నేపథ్యంలో 2029 ఎన్నికలలో పార్టీ ఓటమి ఖాయమని అంచనా వేశారు. తెలుగు దేశం పార్టీని విపత్కర పరిస్థితుల నుంచి కాపాడాలంటే అన్న నందమూరి తారక రామారావు వారసుడు.. జూని యర్ ఎన్టీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

**అమరావతి మహిళకు సీటు కేటాయించాలి**

నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లలో భాగంగా వెంటనే మహిళకు రాజ్యసభ సీటు కేటాయించాలని అది కూడా అమరావతి ప్రాంతానికి చెందిన మహిళకు కేటాయించాలన్నారు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కోసం ఐదు సంవత్స రాల పాటు గత ప్రభుత్వ హయాంలో మహిళలు వీరోచి తమైన పోరాటం చేశారన్నారు. ఆ మహిళల పోరాటానికి గుర్తింపు దక్కాలంటే అమరావతి ప్రాంతానికి చెందిన మహిళకు ఖచ్చితంగా రాజ్యసభ సీటును కేటాయించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అదేవిధంగా ఒక స్థానాన్ని తప్పనిసరిగా బీసీ అభ్యర్థులకు కేటాయించాలని బి.వి.రామ్ డిమాండ్ చేశారు.

**వంగవీటి రాధాను విస్మరించారా?**

కాపు కుల సింహం వంగవీటి రంగా కుమారుడు వంగవీటి రాధాను విస్మరించారా? అని బి.వి.రామ్ ప్రశ్నించారు.

వంగవీటి రాధాకు తగిన రాజకీయ ప్రాధాన్యం ఇస్తామని చెప్పిన టీడీపీ ఇప్పుడు రాజ్యసీట్ల కేటాయింపులో మొండి చేయి చూపిందని రామ్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో సానా సతీష్ కు కేటాయించిన రాజ్యసభ స్థానాన్ని వంగవీటి రాధాకు ఇవ్వాలని తెలుగు శక్తి డిమాండ్ చేస్తోందన్నారు.

# ఘనంగా సండేస్ ఆన్ సైకిల్

## ఫిట్ ఇండియా సైకిల్ డ్రైవులో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ




**కాకినాడ, జూన్ 07 (నేటి మనదేశమ్) :** జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారి జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు నిర్వ హించిన ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్వయంగా పాల్గొని సైక్లింగ్‌ను రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా తోడ్పడవచ్చని తెలిపారు. యువతతో పాటు అన్ని వయస్సుల ప్రజలు సైక్లింగ్‌ను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సబ్ డివిజనల్ ఆఫీసర్ దేవ రాజ్ మనీష్ పాటిల్, ఎస్‌బీ డీఎస్పీ కె వి వి సత్యనారాయణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ నరసింహ మూర్తి, డీసీఆర్‌బీ సీఐ వి శ్రీనివాస రావు, వివిధ పోలీసు స్టేషన్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో పెద్దాపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఏ.బి.జి. తిలక్ నేతృత్వంలోని పెద్దా పురం, సామర్లకోట ప్రాంతాలలో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో సామర్లకోట సీఐ ఆళ్ల కృష్ణ భగవాన్, ఎస్ఐ మూర్తి, ఎస్ఐ గరగారావు, ఎస్ఐ రాజా, పెద్దాపురం సీసీఎస్ సీఐ శ్రీ అంకబాబు, ఎస్ఐ మౌనిక, ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సూరి అప్పారావు, ఉమెన్ ఎస్ ఐ ఎస్. లక్ష్మి కాంతం, జగ్గంపేట ఎస్ ఐ టి రఘునాథ్ రావు ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఏ ఎస్ ఆర్ కాలనీలో జలకం రత్తమ్మకి ఘన నివాళి.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 07, (నేటి మనదేశమ్),** భద్రాచలం అల్లూరి సీతారామరాజు కాలనీలోని ఆదివాసీ కుల పెద్ద జలకం రత్తమ్మ భౌతికకాయాన్ని ఆదివాసీ నాయకులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 1988లో అల్లూరి సీతారామరాజు కాలనీ సాధన కోసం రత్తమ్మ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అలాగే కొత్త మార్కెట్‌లో నిర్మించిన షాపులను ఆదివాసీలకు కేటాయించే విషయంలో ఆమె విశేష కృషి చేశారని పేర్కొన్నారు. కాలనీలో నిర్వహించే సమ్మక్క--సారలమ్మ జాతర ఏర్పాట్లు, నిర్వహణలోనూ ఆమె ఎప్పుడూ ముందుండి సేవలందించేవారని కొనియాడారు. ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. అనంతరం నాయకులు రత్తమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ, కుంజా ధర్మారావు, మానె రామకృష్ణ, పూనెం వీరభద్రం, గుండి శరత్, జగ్గా పుల్లయ్య, జగ్గా కుమారి, సున్నం భూలక్ష్మి, కోర్సా చినబాబు దొర, కుంజా శ్రీను, కుంజా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ అంకిత్...

**ప్రజల ప్రాణ రక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలి.**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 07, (నేటి మనదేశమ్),** గోదావరి వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, తదితర అధికారులతో కలిసి గోదావరి వరదల సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదల వల్ల ముంపునకు గురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు బోట్లు, నాటుపడవలు, లైఫ్ జాకెట్లు, తాడులు, టార్చ్‌లైట్లు, హ్యాండ్ మైకులు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను ముంపు పరిస్థితులు ఏర్పడిన తర్వాత కాకుండా ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గోదావరి నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వరద పరిస్థితులపై ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. ముంపు గ్రామాల ప్రజల ఫోన్ నంబర్లను సేకరించి సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు మండల, జిల్లా స్థాయిల్లో కూడా కంట్రోల్ రూములు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. 108 అంబులెన్సులు, అత్యవసర మందులు, పాము కాటు, తేలు కాటు నివారణ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు, డ్రెయిన్ల శుభ్రత, మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగిపొర్లే సమయంలో ప్రజలు దాటకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పశువుల రక్షణకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని, పశువైద్య సేవలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. 73 అడుగుల వరకు గోదావరి వరదలు వచ్చినా ఎదుర్కొనే విధంగా అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాలు, రెస్క్యూ బృందాలు, అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ పనిచేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన భారీ వృక్షాలు..బిక్కుబిక్కుమంటున్న బస్తీ వాసులు



**మందమర్రి జూన్ 07, (నేటి మనదేశమ్):** ఎండాకాలంలోనే విరిగిపడుతున్న భారీ కొమ్మలు. సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వాసుల్లో పెరుగుతున్న భయాందోళన. వర్షాకాలంలో మరింత ప్రమాదం పొంచి ఉందన్న భయం. ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు స్థానికుల విజ్ఞప్తి మందమర్రి మార్కెట్ సింగరేణి ప్రాంతంలోని సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ పరిసరాల్లో ఉన్న భారీ వృక్షాలు స్థానిక బస్తీ వాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎండాకాలంలోనే బలమైన గాలులకు చెట్ల భారీ కొమ్మలు విరిగి పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విరిగిపడిన కొమ్మలు ఇళ్ల సమీపంలో పడిన ఘటనలు చోటుచేసుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు వణికిపోతున్నారు. క్వార్టర్స్ మధ్యలో ఉన్న దశాబ్దాల నాటి భారీ చెట్లు ప్రమాదకరంగా మారాయని, రానున్న వర్షాకాలంలో ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా చెట్లు పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. చెట్లు ఇళ్లపై పడితే ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు నివసిస్తున్న ఈ ప్రాంతంలో ప్రతి గాలి వీచినప్పుడూ భయంతో గడపాల్సిన పరిస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. ఇప్పటికే పలుమార్లు చెట్ల కొమ్మలు విరిగి పడినా సంబంధిత అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం సంభవించిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే ప్రమాదకరంగా ఉన్న చెట్లను గుర్తించి తొలగించాలని కోరుతున్నారు. భారీ ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి బస్తీ వాసుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఐటిఐ లలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం : ప్రిన్సిపల్ జి. దేవానంద్



**మందమర్రి జూన్ 07, (నేటి మనదేశమ్):** మందమర్రి పట్టణంలో ఐటిఐ 2026 - 27 ఈ విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐ ల లో అడ్మిషన్ల కొరకు నోటిఫికేషన్ విడుదల అయినట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ జి. దేవానంద్ తెలిపారు. ఇంజనీరింగ్ నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్ ల లో ప్రవేశాల కోసం తేదీ 25 - 5 - 2026 నుండి ఈనెల జూన్ 8 వ తేదీ వరకు ఆన్ లైన్ లో వంద రూపాయల ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు. పట్టణంలోని ఐటిఐ లో కోర్సులు ఎలక్ట్రిషన్, ఫిట్టర్ డీజిల్ మెకానిక్, డ్రాట్స్ మెయిన్ సివిల్, మ్యాన్ ఫ్యాక్చరింగ్ ప్రాసెస్, ఆటో మిషిన్, ఇండస్ట్రియల్ రోబోటిక్, బేసిక్ డిజైనర్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎస్ ఎస్ సి, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్, ధ్రువ పత్రాలు ఫోన్ నెంబర్ మెయిల్ ఐడి లలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ జి. దేవానంద్, తెలిపారు.

## హరిత భవిష్యత్తు కోసం సైక్లింగ్ కామారెడ్డిలో ఫిట్ ఇండియా ర్యాలీ

**సైక్లింగ్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**




**కామారెడ్డి,జూన్ 07.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కామారెడ్డి పట్టణంలో "హరిత భవిష్యత్తు కోసం సైక్లింగ్" అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఫిట్ ఇండియా మూవ్‌మెంట్ సైక్లింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో ఫిట్ ఇండియా ఉద్యమం కింద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే సైక్లింగ్‌ను ప్రజల్లో ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సైక్లింగ్ అనేది ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడమే కాకుండా కాలుష్య నియంత్రణకు కూడా దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో సైక్లింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజంతో పాటు పచ్చని పర్యావరణాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రభుత్వ అధికారులు , వివిధ వర్గాల ప్రజలు ఉత్సాహంగా ఈ సైక్లింగ్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్ వి గిరి, డివై స్ఓ వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, క్రీడా సంఘాల సభ్యులు , యువత తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌లో ఘనంగా ముగిసిన "హ్యాపీ సండే" వేడుకలు



**మహబూబ్‌నగర్ జూన్ 07, (నేటి మనదేశమ్):** నగరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన "హ్యాపీ సండే" సంబరాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు కార్యక్రమం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ ముగింపు వేడుకలకు మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పాటలకు మహిళలతో కలిసి మేయర్ నృత్యం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. వేడుకల్లో వివిధ డాన్స్ అకాడమీల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సీనియర్ సిటిజన్లు పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించారు. ప్రతిభ కనబరిచిన కళాకారులను మేయర్ ప్రత్యేకంగా అభినందించి, శాలువాలు కప్పి మెమొంటోలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, మునిసిపల్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. "హ్యాపీ సండే" కార్యక్రమం నగర ప్రజలకు వినోదంతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందించే వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

## దాహార్తి తీర్చడానికి నిజాంసాగర్ ప్రాజెక్ట్ ప్రధాన కాలువలోకి 1000 క్యూసెక్స్ నీటిని విడుదల



**కామారెడ్డి,జూన్ 07.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** నీటి పారుదల శాఖ, నిజాంసాగర్ ప్రాజెక్టు, కామారెడ్డి జిల్లా ఒక ప్రకటనలో ఇలా తెలియజేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి బోధన్ పట్టణ మరియు పరిసర గ్రామాల త్రాగునీటి అవసరాలను తీర్చుటకై నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి నేడు 4:00 గంటలకు 1000 క్యూసెక్స్ నీటిని విడుదల చేయబడుచున్నది. అందువల్ల కాలువ పరిధిలోని రైతులు, పశువుల కాపరులు, ప్రజలు మరియు ఇతరులు అప్రమత్తంగా ఉండవలెను. కాలువలో లేదా కాలువ గట్లపైకి ప్రవేశించరాదు. పశువులను కాలువ సమీపానికి తీసుకురాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవలెను. చిన్నపిల్లలను కాలువ ప్రాంతాలకు వెళ్లనీయకుండా చూడవలెను. అదేవిధంగా, ప్రస్తుతం విడుదల చేయబడుతున్న నీరు కేవలం బోధన్ పట్టణం మరియు పరిసర గ్రామాల త్రాగునీటి అవసరాల కొరకు మాత్రమే. ఈ నీటిని సాగునీటి అవసరాల కొరకు వినియోగించరాదని రైతుకు తెలియజేయడమైనది.

## పాలమూరు ప్రాజెక్టుపై కాంగ్రెస్ వైఖరి స్పష్టం చేయాలి మాజీ మంత్రి : శ్రీనివాస్ గౌడ్




**మహబూబ్‌నగర్, జూన్ 07, (నేటి మనదేశమ్):** : జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు పాల్గొన్న మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజుల జిల్లా పర్యటన ప్రజల ఆశలను నెరవేర్చలేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారో సీఎం స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టులో కాల్వలు, టన్నెల్లు, మోటార్లు, పంప్ హౌస్‌లు, రిజర్వాయర్ల నిర్మాణం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందని, ప్రాజెక్టు కోసం రూ.33,500 కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రాజెక్టు ఆలస్యానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని, కోర్టు కేసుల ద్వారా అడ్డంకులు సృష్టించిందన్నారు. రెండున్నరేళ్లు గడిచినా కొల్లాపూర్ నియోజకవర్గంలో కాల్వల తవ్వకం పూర్తికాలేదని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతులకు ఎరువులు, పెన్షన్ల పెంపు, సంక్షేమ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు కూడా కాంగ్రెస్ పాలన పట్ల సంతృప్తిగా లేరని అన్నారు. కాంగ్రెస్ నాయకులు పాలమూరు ప్రాజెక్టుపై తమ ప్రభుత్వం చేసిన పనులను ప్రజలకు వివరించాలని, కేవలం కేసీఆర్‌ను విమర్శించడం ద్వారా అభివృద్ధి జరగదని శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

## నల్లమల బిడ్డనని చెప్పుకునే రేవంత్ రెడ్డి అచ్చంపేటకి ఏం చేశారు?

**జడ్చర్ల ఎమ్మెల్యే అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలి**


**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్ గౌడ్ డిమాండ్**



**షాద్ నగర్ జూన్ 07, (నేటి మనదేశమ్):** ప్రతి మీటింగ్ లో నల్లమల్ల బిడ్డను, నల్లమల టైగర్ అని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి అచ్చంపేట నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి నల్లమల్ల బిడ్డను, జడ్చర్ల నియోజకవర్గం నాకు రాజకీయ భిక్ష పెట్టిందని పదేపదే చెప్పుకుంటున్నారు తప్ప అభివృద్ధికి ఏమాత్రం నిధులు ఇవ్వడం లేదని, ప్రత్యేకంగా అభివృద్ధి చేసినది ఏమీ లేదని కొట్టిపారేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సైతం తాను జడ్చర్ల ఉదండాపూర్ నిర్వాసితులకు ఏదో చేశానని గొప్పలు చెప్పుకుంటున్నారని, ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధిపై నిర్వాసితులకు చేసిన సాయంపై శ్వేత పత్రం విడుదల చేసి సమాజానికి తెలియపరిస్తే బాగుంటుందని సూచన చేశారు. అనవసరంగా సీఎం రేవంత్ రెడ్డి బిజెపిపై నోరు పారేసుకుంటున్నారని, కేవలం మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ సర్కారు ఉందని, కానీ బిజెపి సర్కార్ దేశవ్యాప్తంగా సుమారు 20 రాష్ట్రాల్లో పరిపాలన అందిస్తుందని, బిజెపితో కాంగ్రెస్ పోల్చడం సిగ్గుచేటు అన్నారు. బిజెపిపై ఆరోపణలు చేసే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించి సీఎం మాట్లాడితే బాగుంటుందని పేర్కొన్నారు. ప్రతిపక్షలపై బురదజల్లే ప్రయత్నం మానుకొని అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరిస్తే బాగుంటుందని చురకలు అంటించారు.

## జిల్లాస్థాయి పెన్కాక్ సిలాట్ పోటీలు ఘనంగా ప్రారంభం

**మందమర్రి జూన్ 07, (నేటి మనదేశమ్):** మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం జిల్లాస్థాయి పెన్కాక్ సిలాట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి హనుమంత్ రెడ్డి మరియు భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కల రమేష్ ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలలో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులు ఈ నెల 14న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పెన్కాక్ సిలాట్ పోటీలకు ఎంపిక కాబోతున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తెలిపారు.



ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల అధికారి హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, పెన్కాక్ సిలాట్ కేంద్ర ప్రభుత్వం గుర్తించిన క్రీడలలో ఒకటని తెలిపారు. ఈ క్రీడలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే కొన్ని ఉద్యోగాల్లో రిజర్వేషన్ అవకాశాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పెన్కాక్ సిలాట్ జిల్లా అధ్యక్షుడు పోచంపల్లి వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రంగు శ్రీనివాస్, కోశాధికారి మెయిన్, ఆల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికృష్ణ, మాస్టర్స్ రంగ రమేష్, రమేష్ రాజా, జెట్టి కృష్ణ, కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ ఇచ్చిన వజ్రాన్ని కొనాలనుకున్నా : జిల్ బైడెన్



జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రధాని మోదీబహూకరించిన 7.5 క్యారెట్ల సింథటిక్ వజ్రాన్ని అమెరికా మాజీ ప్రథమ మహిళ జిల్ బైడెన్ గుర్తు చేసుకున్నారు. మోదీ బహుమతిగా ఇచ్చిన వజ్రాన్ని తనవద్దే ఉంచుకోవాలని తొలుత అనుకున్నానని.. కానీ, అమెరికా అధికారులు దానికి ఎక్కువ విలువ కట్టడంతో ఆ డైమండ్‌ను ఫెడరల్ ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసినట్లు 'వ్యూ ఫ్రమ్ ది ఈస్ట్ వింగ్: ఎ మెమోయిర్' అనే తన ఆత్మకథలో రాసుకొచ్చారు. ఈ పుస్తకంలో వైట్ హౌస్‌లోని తెరవెనుక జీవితం గురించి.. అధ్యక్షుడి కుటుంబం అందుకునే బహుమతులకు ఉన్న నిబంధనల గురించి జిల్ బైడెన్ వివరించారు.

2023, జూన్‌లో అమెరికా అధ్యక్ష భవనం ఇచ్చిన అధికారిక విందులో మోదీ అతిథిగా పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన బహూకరించిన వజ్రం తనను ఎంతో ఆకర్షించిందని.. చాలా అద్భుతంగా ఉందని జిల్ బైడెన్ పేర్కొన్నారు. అయితే బైడెన్ పదవి నుంచి తప్పుకున్న తర్వాత అమెరికా నియమాల ప్రకారం.. ఆ బహుమతిని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాల్సి వచ్చిందని తెలిపారు. దానికి అప్పట్లో ఉన్న మార్కెట్ విలువను చెల్లించి కొనుగోలు చేయడానికి అధికారులు అనుమతిస్తారని అన్నారు. దీంతో ఆ డైమండ్‌ను కొనుగోలు చేయాలని తాను అనుకున్నట్లు తెలిపారు. విదేశాంగ శాఖ వజ్రం విలువను 20 వేల డాలర్లుగా అంచనా వేయడంతో దానిని కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. అందుకు బదులుగా ఆ వజ్రాన్ని అరువుగా తీసుకుని అధికారిక కార్యక్రమాల్లో ధరించడానికి అధికారులు తనకు అనుమతి ఇచ్చారని అన్నారు. దీంతో ఆ డైమండ్‌ను ఓ ఉంగానికి పొదిగించి ధరించినట్లు తెలిపారు. ఫ్రాన్స్ ప్రథమ మహిళ బ్రిగిట్టే మెక్రాన్ తనకు ఇచ్చిన బ్రాస్‌లెట్‌ను అమెరికా ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాగా 2023లో జిల్ బైడెన్‌కు ప్రపంచ దేశాధినేతల నుంచి అందిన బహుమతుల్లో అతి ఖరీదైనది మోదీ బహూకరించిన వజ్రమే అని అప్పట్లో అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది.

# ఏఐ సాయంతో తొలిసారిగా టీకా అభివృద్ధి




కొవిడ్-19 రాకముందే దానికి టీకా అందుబాటులో ఉంటే? ప్రపంచవ్యాప్తంగా లాక్‌డౌన్లు, ప్రాణ నష్టం తప్పేవి కదా. కానీ కొత్త మహమ్మారులు పురుడు పోసుకోకముందే వాటికి కారణమయ్యే వైరస్‌లను ఊహించేదెలా? టీకాలు రూపొందించేదెలా? వైరస్ స్వభావాన్ని తెలుసుకోకుండా వ్యాక్సిన్ రూపకల్పన అసాధ్యం! కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన జొనాథన్ హీనీ నేతృత్వంలోని బృందం.. ఈ లోటును అధిగమించింది. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో సరికొత్త టీకా పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసింది. ఇది ఆ తరగతికి సంబంధించిన అన్ని వైరస్ రకాలనూ ఎదుర్కొనే రోగనిరోధక శక్తిని సంతరింపజేస్తుండటం, ముమ్ముందు మారిపోయే వైరస్ రకాల నుంచీ రక్షణ కల్పిస్తుండటం విశేషం. అదీ ఒకే ఒక్క ఇంజెక్షన్‌తో! అందుకే దీన్ని భవిష్యత్ మహమ్మారుల పాలిట బ్రహ్మాస్త్రంగా అభివర్ణిస్తున్నారు.

**ఎలా పని చేస్తుంది? :** సాధారణంగా టీకాలను ప్రస్తుత వైరస్ రకాలను ఉపయోగించుకొని తయారుచేస్తుంటారు. కేంబ్రిడ్జి పరిశోధకులు మాత్రం కొవిడ్ పరిశీలన కార్యక్రమాల్లో సేకరించిన రకరకాల కరోనా వైరస్‌ల జన్యు సంకేతాలను ఏఐ సాయంతో విశ్లేషించారు. వైరస్‌లు మనుగడ సాగించటానికి తోడ్పడుతున్న కీలక అంశాలను నిర్దిష్టంగా గుర్తించారు. వీటన్నింటి ఆధారంగా ఒక 'సూపర్ యాంటీజెన్'ను రూపొందించారు. దీనితో సార్బెకో కరోనావైరస్ టీకాను తయారుచేశారు. ఆ వైరస్ తరగతికి సంబంధించిన అన్ని రకాలను ఎదుర్కొనేలా మానవ రోగనిరోధక వ్యవస్థకు శిక్షణ ఇవ్వటం దీని ప్రత్యేకత. వైరస్ మార్పునకు లోనైనా, జంతువుల నుంచి మనుషులకు కొత్తగా ఇన్‌ఫెక్షన్ సోకినా కూడా రక్షణ కల్పిస్తుంది. సూపర్ యాంటీజెన్ భావన.. టీకా తయారీలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే కేంబ్రిడ్జి పరిశోధకులు సార్వత్రిక ఫ్లూ, బర్డ్ ఫ్లూ టీకాలపై జంతు ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. మెదడులో రక్తస్రావానికి కారణమయ్యే ఎబోలా వంటి వైరస్‌లకూ టీకాలు రూపొందించటం మీద దృష్టి సారించారు.

ప్రయోగ పరీక్షలో సురక్షితంగా సార్బెకో కరోనావైరస్ టీకాను ఆరోగ్యవంతులైన 49 మందిపై పరీక్షించారు. దీన్ని సూక్ష్మ ద్రవ ప్రవాహం ద్వారా డీఎన్ఏ టీకా రూపంలో ఇచ్చారు. ఇదో సూది రహిత విధానం. అధిక పీడనంతో, వెంట్రుకంత సన్నటి ద్రవ ప్రవాహంతో టీకాను నేరుగా చర్మ కణాల్లోకి ప్రవేశపెట్టటం దీని ప్రత్యేకత. సూది గుచ్చుకుంటుందనే భయం ఉండదు. ఈ టీకా సురక్షితంగా పనిచేస్తున్నట్టు, కొవిడ్ వైరస్‌కు బలమైన రోగనిరోధక ప్రతిస్పందనను ప్రేరేపిస్తున్నట్టు వెల్లడైంది. పెద్దగా దుష్ప్రభావాలేమీ లేవని కూడా తేలింది. ఒక్క సార్స్-కొవ్-2, సార్స్ వైరస్‌లను మాత్రమే కాదు. ముమ్ముందు జంతువుల నుంచి మనుషులకు సోకే అవకాశం ఉన్న మొత్తం గబ్బిలాల వైరస్ జాతులనూ ఎదుర్కొనేలా రోగనిరోధక ప్రతిస్పందనను ప్రేరేపిస్తుండటం విశేషం. దీంతో రెండో దశ పరీక్షలకూ శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఏఐ సాయంతో రూపొందించిన ఒక యాంటీజెన్‌ను మనుషుల మీద పరీక్షించటం ఇదే తొలిసారి.

# ఎల్‌పిజి ధరల పెంపుపై మోడీ ప్రభుత్వంపై విరుచుకుపడిన ఖర్గే



న్యూఢిల్లీ : ఎల్ పి జి ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ మోడీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. యుపిఎ హయాంలో ద్రవ్యోల్బణంపై గగ్గోలు పెట్టిన బిజెపి నేతలు, ఇప్పుడు సిలిండర్లతో నిరసనగా వీధుల్లోకి ఎందుకు రావడం లేదని ప్రశ్నించింది. ఢిల్లీలో 14.2 కేజీల గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.913 నుండి రూ.942కు పెంచిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జున్ ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి 7న సిలిండర్‌పై ?60 పెంచిన తర్వాత తాజాగా మరోసారి పెంచిందని, దీంతో గత నాలుగు నెలల్లోనే సిలిండర్ పై మొత్తం ?89కి పెంచిందని అన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎం యూవై) లబ్ధిదారులు ఏటా మొదటి నాలుగు రీఫిల్స్ పై రూ.300 సబ్సిడీని పొందిన తర్వాత, ప్రతి సిలిందర్‌కు వాస్తవంగా రూ.642 చెల్లిస్తూనే ఉంటారని అన్నారు. మోడీ ప్రభుత్వాన్ని ఖర్గే మూడు ప్రశ్నలు అడిగారు. పశ్చిమాసియా సంఘర్షణకు ప్రతిస్పందనగా 41 దేశాలలో ఇంధన వనరులను వైవిధ్య పరచడం గురించి ప్రధాని మోడీ చేసిన గొప్ప వాగ్దానాల సంగతేమిటని,

గ్రామీణ ప్రాంతాల్లో ఈనా టికీ ఎల్ పి జి కొరత ఎందుకు కొనసాగు తోందని ప్రశ్నించారు. అలాగే ఉజ్వల పథకం కింద, 2025-26 సంవత్సరంలో 5.56 కోట్ల కుటుంబాలకు ఒక్క రీఫిల్ కూడా అందలేదని (లేదా ఒక్కటి మాత్రమే అందిందని), వీరిలో 3.30 కోట్ల కుటుంబాలు ఒక్క సిలిండర్ రీఫిల్‌ను కూడా ఎంచు కోలేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభానికి ముందే ఉన్న ఈ పరిస్థితి మోడీ ప్రభుత్వ లాభార్జన ఫలితం కాదా అని ప్రశ్నించారు. గత 12 ఏళ్లలో మోడీ ప్రభుత్వం దేశీయ ఎల్‌పిజి ధరలను రూ.530 పెంచిందని, పెరుగుతున్న ధరలు సామాన్యులను నాశనం చేస్తున్నాయని ఖర్గే మండిపడ్డారు. యుపిఎ హయాంలో మోడీ, బిజెపి నేతలు ద్రవ్యోల్బణంపై పెద్ద రచ్చ చేసేవారు. గత 12 ఏళ్లలో మోడీ ప్రభుత్వం దేశీయ ఎల్ పి జి ధరలను రూ.530 పెంచిందన్నది నిజం కాదా?

మరి ఇప్పుడు బిజెపి నేతలు, ఎల్‌పిజి సిలిండర్లతో నిరసనగా వీధుల్లోకి ఎందుకు రావడం లేదని నిలదీశారు.

# నైజర్ ఎడారి విషాదం
# దాహంతో 49 మంది మృతి!



నియామే (నైజర్): సహారా ఎడారిలో అత్యంత హృదయ విదారక సంఘటన చోటు చేసు కుంది. మాలీ దేశంలో పండుగ వేడుకలు ముగించుకుని తిరుగుపయనమైన ప్రయాణికులను మోసుకెళ్తున్న ఒక లారీ ఎడారి నడిబొడ్డున పాడైపోవడంతో.. తీవ్రమైన ఎండలు, దాహా నికి తట్టుకోలేక మహిళలు, పిల్లలతో సహా 49 మంది ప్రాణాలు కోల్పో యారు. ఉత్తర నైజర్‌లోని అస్సామాకా పట్టణానికి పశ్చిమంగా దాదాపు 80 కిలోమీటర్ల దూరంలో, అల్జీరియా సరిహద్దుకు సమీపంలో ఈ ఘోరం జరిగింది. ఈ ప్రమాదం నుండి ఇద్దరు ప్రయాణికులు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. లారీ ఆగిపోయిన తర్వాత వారు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని, సహాయం కోసం ఎడారి ఇసుక తిన్నెలపై దాదాపు 50 కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణించారు. ఎట్టకేలకు అస్సామాకా పట్టణానికి చేరుకుని స్థానిక అధికారులకు సమాచారం అందించడంతో ఈ దారుణ ఉదంతం వెలుగులోకి వచ్చింది.

**అక్కడే సామూహిక ఖననం.. :** సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అయితే, అప్పటికే లారీలో ఉన్న 49 మంది మరణించారు. ఎడారిలో ఉష్ణోగ్రతలు విపరీతంగా ఉండటం, మృతదేహాలు ఇప్పటికే కుళ్ళిపోయే స్థితికి చేరుకోవడంతో.. అధికారుల సమక్షంలోనే వారిని ఎడారిలోనే సామూహికంగా ఖననం చేశారు.

# గర్భిణికి పోషకాహారం పంపిణీ
# ప్యాకెట్‌లో చనిపోయిన పాము పిల్ల





మధ్యప్రదేశ్‌లోని పాంధుర్ణా జిల్లాలో ఊహిం చని ఘటన చోటు చేసు కుంది. ఓ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణికి పంపిణీ చేసిన పోషకాహార ప్యాకెట్‌లో చనిపోయిన పాము పిల్ల కనిపించడం కలకలం రేపింది. తీవ్ర భయాం దోళనకు గురైన ఆమె కుటుంబీకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కర్ఘాట్ కామతీ గ్రామానికి చెందిన ఓ గర్భిణి స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల కొన్ని పోషకాహార ప్యాకెట్‌లు తీసుకున్నారు. తెరచి చూడగా.. ఒకదాంట్లో చనిపోయిన పాము పిల్ల ఉండటం చూసి అవాక్కయ్యారు. ఈ విషయం తెలిసి భయాందోళనకు గురైన కుటుంబీకులు, గ్రామస్థులతో కలిసి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి సిబ్బందితోపాటు ఉన్నతాధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రంగంలోకి దిగిన మహిళా శిశు సంక్షేమాభివృద్ధి శాఖ అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ కోసం ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. ఆహార ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకొని నమూనాలను టెస్టింగ్‌కు పంపించామని, నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసు కుంటామన్నారు.

# వంటగ్యాస్ ధర రూ.29 పెంపు

దిల్లీ: గృహావసరాలకు వాడే ఎల్పీజీ సిలిండర్ ధర రూ.29 పెరిగింది. సరిగ్గా మూడు నెలల క్రితం.. మార్చి 7న ఒకేసారి రూ.60 పెంచారు. తాజా పెంపుతో దిల్లీలో 14.2 కిలోల వంటగ్యాస్ ధర రూ.913 నుంచి 942కి చేరుతుంది. ఆయా రాష్ట్రాల పన్నుల ఆధారంగా దీనిలో కొంత మార్పు ఉంటుంది. ఆదివారం నుంచే ఇది అమల్లోకి వస్తుంది.




# ఇజ్రాయిల్ ఆక్రమణలను అడ్డుకోండి
## ట్రంప్‌ను కోరిన పాలస్తీనా రాయబారి



న్యూయార్క్ : తమ భూభాగాలపై ఇజ్రాయిల్ ఆక్రమణలను అడ్డుకోవాలని ఐక్యరాజ్యసమితిలో పాలస్తీనా రాయబారి రియాద్ మన్సూర్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కోరారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'అలజడి నుంచి మధ్యప్రాచ్యాన్ని కాపాడి, శాంతి'న్యాయం వైపు అడుగులు వేసేలా నెతన్యాహూను నడిపే సామర్థ్యం, అందుకు అవసరమైన మార్గాలు ట్రంప్ వద్ద ఉన్నాయని నాకు తెలుసు. అందుకే మాలో చాలా మంది ఆయనతో కలిసి పనిచేస్తున్నారు' అని చెప్పారు. ఈ సమావేశంలో పలు అరబ్, ముస్లిం దేశాల రాయబారులు కూడా పాల్గొన్నారు. లెబనాన్‌లో అర్థరహిత చర్యలను, పిచ్చి పనులను ఆపేయాలంటూ ఇటీవల నెతన్యాహూకు ట్రంప్ చెప్పారన్న విషయం అందరికీ తెలుసునని అన్నారు. 'ఆ భూభాగాన్ని కలుపుకునే అధికారం మీకు లేదని తెలుసు కదా' అని చురక వేశారు. ఐక్యరాజ్యసమితిలోని అరబ్ దేశాల కూటమి కూడా పాలస్తీనా రాయబారి అభిప్రాయాలతో ఏకీభవించింది. ఇజ్రాయిల్ దురాక్రమణ, సైనిక హింసకు వ్యతిరేకంగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వేగవంతమైన ఆక్రమణలతో పాలస్తీనియన్ల హక్కులను ఓ పద్ధతి ప్రకారం హరించే విధానాలకు ఇజ్రాయిల్ పాల్పడుతోందని అరబ్ కూటమి తరఫున సౌదీ రాయబారి అబ్దులజీజ్ అల్వాసిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ చర్యలు ఏవో కొన్ని ఘటనలకే పరిమితం కావని, అవి పాలస్తీనా భూభాగంపై శాశ్వత నియంత్రణ కోసం, అక్కడి జనాభాను-భౌగోళిక వాస్తవికతలను మార్చడానికి వేస్తున్న ఎత్తుగడలేనని అరబ్ గ్రూప్ తెలిపింది. ఐరాస తీర్మానాలకు అనుగుణంగా సార్వభౌమాధికారం కలిగిన, ఆచరణ సాధ్యమైన, అవిచ్ఛిన్నమైన పాలస్తీనా దేశం ఏర్పడే అవకాశాన్ని లేకుండా చేయడానికి ఇజ్రాయిల్ వ్యూహ రచన చేస్తోందని విమర్శించింది.

# భారత్‌తో కాల్పుల విరమణ..
# ట్రంప్‌నకు రుణపడి ఉంటాం
## పాక్ ప్రధాని షెహబాజ్

ఇస్లామాబాద్: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొన సాగుతున్నప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సరైన సమయంలో జోక్యం చేసుకొని కాల్పుల విరమణకు దోహదం చేశారని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. అందుకు పాక్ ఆయన పట్ల ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటుందన్నారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురు వారం ఇక్కడ యూఎస్ ఎంబసీ నిర్వహించిన కార్యక్రమంలో షెహబాజ్ మాట్లాడారు. గతేడాది పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య నాలుగురోజుల పాటు కొనసాగిన ఉద్రిక్తతల గురించి ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

# అన్నామలైకు తోడుగా..
# ఒక్క రోజులోనే 14లక్షల మంది..!



తమిళనాడు భాజపా మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై (గూఅఖుఝిశ్రీఖఱ) ఆ పార్టీకి రాజీనామా చేసిన 24గంటల్లోనే 14లక్షల మందికి పైగా ఆయనతో చేరారు. తాను చేపట్టే 'వుయ్ ద లీడర్స్' ఉద్యమంలో చేరాలని కోరుతూ అన్నామలై ఆన్‌లైన్ లింక్ (ఔవ ఎష్ట్రవ ాముఎవతీం)ను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో పెద్దఎత్తున స్పందన వస్తోంది. శుక్రవారం నుంచి శనివారం సాయంత్రానికి 14లక్షల మందికి పైగా అందులో చేరారు. ఇంకా సభ్యత్వాలు కొనసాగుతున్నాయి. ఇదే పేరుతో ఆయన 2020లోనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. శుక్రవారం అన్నామలై మాట్లాడుతూ.. నైతిక రాజకీయాల కోసం ఏపీజే అబ్దుల్ కలాం కేంద్రాన్ని కోయంబత్తూర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

త్వరలో కొత్త పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించారు. ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి మంచి ఉద్దేశంతో నాడు భాజపాలో చేరానని, అదే ఉద్దేశంతో నేడు కొత్త పార్టీ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఒక సామాన్యుడు రాజకీయాల్లోకి రావడం చాలా పెద్ద విషయమని అన్నారు. నేతల దగ్గరకు ప్రజలకు తీసుకువెళ్లడం కాకుండా.. రాజకీయాలనే ప్రజల వద్దకు తీసుకువెళ్లడమే తన ఆలోచన అని పేర్కొన్నారు. సంప్రదాయ, వంశపారంపర్య రాజకీయాలను అంతం చేయడానికి తనతో కలసిరావాలని యువతను కోరారు.

# అమెరికాలో భారత మామిడి హవా



న్యూయార్క్: అమెరికా మార్కెట్లను భారత మామిడి పండ్లు ముంచెత్తుతున్నాయి. అక్కడ నుంచి దిగుమతయ్యే విభిన్న రుచుల పండ్ల కోసం ఇక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మామిడి ఎగుమతులపై అమెరికా మార్కెట్లలో ఉన్న గిరాకీ గురించి అవగాహన కల్పించేందుకు సియాటెల్‌లోని భారత కాన్సులేట్ జనరల్ ఓ కార్యక్రమాన్ని నిర్వహిం చింది. 'మ్యాంగో మ్యాజిక్: ప్రమోషన్ అండ్ టేస్టింగ్ ఈవెంట్ ఆఫ్ ఇండియన్ మ్యాంగోస్' పేరుతో నిర్వహించిన ఈ వేడుకకు 100 మందికిపైగా భారత మామిడి పండ్ల దిగుమతి దారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులకు కాన్సులేట్ ప్రతి నిధులు మహారాష్ట్రకు చెందిన ఆల్ఫాన్సో, కేసర్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బంగినపల్లి, హిమాయత్, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన లాంగ్డా, దశహరీ, గుజరాత్‌కు చెందిన రైప్ రాజాపురి పండ్ల రుచులను అతిథులకు చూపించారు. కోస్ట్‌కో వైస్ ప్రెసిడెంట్ బాబ్ హాస్కీ మాట్లాడుతూ.. కేసర్ మామిడి పండ్లను స్టోర్లలో పెట్టిన రెండు గంటలకే అమ్ముడుబోతున్నాయని తెలిపారు.

మామిడి ఎగుమతుల్లో భారత్‌దే అధిక వాటా. సుమారుగా 2.6 కోట్ల టన్నుల 1,000 రకాలకుపైగా మామిడి పండ్లను ఎగుమతి చేస్తోంది. అమెరికాకు 2007 నుంచి భారత్ నుంచి మామిడి ఎగుమతులు ఏటా పెరుగుతున్నాయి. 2023-24లో ఈ మార్కెట్ విలువ రూ.94.95 కోట్లుగా ఉండగా అది ముందటి ఏడాది కంటే 130 శాతం ఎక్కువ.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా ఎస్పీ డి. జనకి



**మహబూబ్‌నగర్ జూన్ 07, (నేటి మనదేశమ్):** : ప్రజలకు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయం అందించేందుకు జూన్ 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జనకి, ఐపీఎస్ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులు, ట్రాఫిక్ చలాన్లు, రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, సివిల్ తగాదాలు తదితర అంశాలను పరస్పర అంగీకారంతో లోక్ అదాలత్‌లో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం లభించడంతో పాటు సమయం, ధనం ఆదా అవుతాయని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలకు సామరస్యపూర్వక ముగింపు పలికేందుకు ఇది ఉత్తమ వేదిక అని పేర్కొన్నారు. ప్రజలు తమ కేసుల వివరాలతో సంబంధిత కోర్టులు, న్యాయవాదులు లేదా పోలీసు అధికారులను సంప్రదించి, లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని పరస్పర అవగాహనతో తమ వివాదాలను ముగించుకోవాలని ఎస్పీ కోరారు.

# పోరాటం ఆగదు... ఢిల్లీ ర్యాలీ సక్సెస్

**11 డిమాండ్ల సాధనలో వెనక్కి తగ్గేది లేదు...జంతర్ మంతర్ లో మా గళం వినిపించాం**

**నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు అరుణ**




**జగిత్యాల,జూన్ 7( నేటి మన దేశమ్ ప్రతినిధి):** మా 11 డిమాండ్ల సాధనే లక్ష్యమని,మా పోరాటం ఆగదని ఢిల్లీ ర్యాలీలో జగిత్యాల జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు క్యారంగుల అరుణ అన్నారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన నాల్గవ తరగతి ఉద్యోగుల గ్రాండ్ ప్రొటెస్ట్ ర్యాలీ చారిత్రాత్మకమని, 11 డిమాండ్ల సాధనలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అరుణ స్పష్టం చేశారు.
ఢిల్లీలో ర్యాలీ అనంతరం అరుణ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. "దేశవ్యాప్తంగా వేలాది మంది 'డి'గ్రూప్ ఉద్యోగులు జంతర్ మంతర్‌ను హోరెత్తించి,మా ఆవేదనను కేంద్రానికి వినిపించామన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 11 అంశాలపై ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమం ఆగదని ఆమె పేర్కొన్నారు."మే 22న బ్లాక్ బ్యాడ్జ్ నిరసనతో మొదలైన మా పోరాటం, ఆదివారం ఢిల్లీలో భారీ ర్యాలీతో మరింత ఉధృతమైందన్నారు. అసోసియేషన్ కేంద్ర సంఘం అధ్యక్షులు లూనావత్ దాస్య, ప్రధాన కార్యదర్శి ఖాదర్ బిన్ హసన్ నాయకత్వంలో ఐక్యంగా పోరాడుతున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి తరలివచ్చిన ఉద్యోగులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. "ఇది మాత్రమేనని,డిమాండ్లు నెరవేరే వరకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని అరుణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షులు లూనావత్ దాస్య, అసోసియేట్ అధ్యక్షులు రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఖాదర్ బిన్ హాసన్, సిటీ అధ్యక్షులు లక్ష్మణ్ రావు, కార్యదర్శి అతిక్ పాషా,జగిత్యాల జిల్లా నుండి భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభతోనే గుర్తింపు సాధ్యం

**జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మైలారపు లింబాద్రి**




**జగిత్యాల, మల్యాల/జూన్ 07(నేటి మన దేశమ్ ప్రతినిధి):** ప్రతిభతోనే గుర్తింపు సాధ్యమని జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు, మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ లు అన్నారు. ఆదివారం మండలం జిల్లాలోని మల్యాల క్రాస్ రోడ్డులో గల కొత్త సురేశ్ పంక్షన్ హాలులో శ్రీ వాసవి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పబ్బ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సర జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య ప్రతిభా పురస్కార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇంటర్, పదవ తరగతి పరీక్షలల్లో అత్యధిక మార్కులు సాధించిన సుమారు 120 మందికి పైగా ఆర్యవైశ్య విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, తల్లిదండ్రులకు శాలువలతో సత్కారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 7 సంవత్సరాలుగా ప్రతీ సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తూ ప్రోత్సాహం కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు సమాజ సేవకు ఉపయోగపడే ఉన్నతమైన చదువులు చదవి ఆదర్శంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకొని రావాలన్నారు. ఉన్నతమైన విద్యతో పాటు లోకజ్ఞానం కలిగియుండాలని సూచించారు. ముందుగా వాసవి మాత చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో శ్రీ వాసవి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పబ్బ శ్రీనివాస్, జగిత్యాల, మెట్ పల్లి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వూటూరి నవీన్, మైలారపు రాంబాబు,, ఆర్టీఏ సభ్యుడు కంటాల శ్రీనివాస్, నాయకులు బుడికె శ్రీకాంత్, పల్లెర్ల రాజు, మర్యాల రాజన్న, కట్కం రాజేశ్, భూసం సతీష్,కట్కూరి సంతోష్, బొడ్ల జగదీశ్, చెట్ల పవన్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందజేస్తా

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**




**జగిత్యాల, జూన్ 07 (నేటి మన దేశమ్ ప్రతినిధి):** :క్రీడాభివృద్ధికి తనవంతు సహాయ,సహకారాలు అందజేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారంజగిత్యాల కేంద్ర లోని ఎస్ కె ఎన్ ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో యజ్ఞ డిఫెన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వ అగ్ని వీర్ నియామక పరీక్షలలో 12 మంది యజ్ఞ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొంది ఎంపిక కాగా ఈరోజు ఎంపికైన 12 మంది యువకులను సన్మానించి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అభినందనలు తెలియజేశారు. ఎంపికైన యువకులు మాట్లాడుతూ ఎస్ కే ఎన్ ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో నిరుద్యోగ యువత కోసం 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఏర్పాటుకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కృషి తోనే అగ్నివీర్ లో ఉద్యోగాలు పొందడం సాధ్యమైందని ఎమ్మెల్యే కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సంధర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ 12 మంది యువకులు ఉద్యోగాలు పొందడం చాలా ఆనందదాయకం అన్నారు. గతంలో కొందరు నిరుద్యోగ యువకులు రన్నింగ్ ట్రాక్ లేక ఉద్యోగాలు పొందలేదని తెలిసి ట్రాక్ ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్,స్పోర్ట్స్ అథారిటీ సహకారం తో జగిత్యాల కు స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నానని హామీ ఇచ్చారు. జగిత్యాల లో క్రీడల అభివృద్ధి కి తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కటిపల్లి గంగారెడ్డి కౌన్సిలర్లు ఏనుగుల లావణ్య రాజు, దయల చంద్రకళ శంకర్, కూతురు శేఖర్ ,బండ శంకర్, సమిండ్ల శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్లు తోట మల్లికార్జున్ ,కుసరి అనిల్ ,అకాడమీ నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి,ఎంపీవో రవిబాబు,సీనియర్ నాయకులు బాలముకుందం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గుండా సురేష్ ,ప్రధాన కార్యదర్శి సాగి శ్రీధర్ రావు,గౌరవాధ్యక్షులు మూలాసపు రాజన్న,మాజీ సర్పంచ్ రమణ రావు, పురుషోత్తం రెడ్డి, మేనేని శ్రీధర్ రావు ,లక్ష్మారెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిలోపు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం..

**నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యం..**

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**

**గొల్లపల్లి మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన..**



**జగిత్యాల/గొల్లపల్లి, జూన్ 07(నేటి మన దేశమ్ ప్రతినిధి):** ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీటిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఏడాదిలోపు నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరానికి సాగు నీరు అందించడమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, కల్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూరు గ్రామంలో రూ.7.65 లక్షలతో పెద్ద చెరువు తూము మరమ్మత్తు పనులకు మంత్రి అడ్లూరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ప్రభుత్వ పాలనలో అనేక సాగు నీటి ప్రాజెక్టు పెండింగ్ లో ఉన్నాయని వాటిని పూర్తి చేయకపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని మంత్రి అన్నారు. నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రూ. 1,000 కోట్లు అవసరమని, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అంగీకరించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. నియోజకవర్గంలోని పత్తిపాక రిజర్వాయర్, అక్కపల్లి లిఫ్ట్, మేడారం రిజర్వాయర్ నుండి కొత్తపల్లి వరకు కాలువ పనులతో పాటు మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులు ఏడాదిలో పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఆనంతరం గొల్లపల్లి మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంత్రి లక్ష్మణ్ కుమార్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. మండలంలోని 17 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయగా 72 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 26 లక్షల 12 వేల విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.. ఆనంతరం గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పోచమ్మ బోనాల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైండ్ల పూజారులు మంత్రి గారికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి నియోజకవర్గ ప్రజలను ఎల్లవేళలా పోచమ్మ తల్లి చల్లగా చూడాలని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా సంతోష్ తో పాటు నాయకులు నిశాంత్ రెడ్డి, సర్పంచుల పోరం అధ్యక్షులు దాసరి తిరుపతి గౌడ్ తో పాటు మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# ధరల పెరుగుదలను నిరసిస్తూ జూన్ 10న కలెక్టరేట్ ముట్టడి: సీపీఐ



**నేరెడ్ మెట్ జూన్ 07, (నేటి మనదేశమ్):** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ తదితర నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 10న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ మల్కాజిగిరి మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న ధరల భారం సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ధరలను నియంత్రించడంలో విఫలమైందని విమర్శించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన పలు హామీల అమలులో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలపై నిరసనగా చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నీట్-2026 రీ ఎగ్జామ్‌కు మహబూబ్‌నగర్‌లో సర్వసన్నాహాలు



**మహబూబ్‌నగర్, జూన్ 07, (నేటి మనదేశమ్):** : నీట్–2026 రీ ఎగ్జామ్ నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఐఏఎస్ మాట్లాడుతూ, జిల్లాలో నీట్–2026 రీ ఎగ్జామ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 13 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 4,291 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

# జువ్వాడి వివాహ వార్షికోత్సవ వేడుకలో ....



**కోరుట్ల, జూన్ 07(నేటి మన దేశమ్ ప్రతినిధి):** కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి, రాష్ట్ర వెలుమ కార్పొరేషన్ ఛైర్మెన్ జువ్వాడి నర్సింగరావు రజనీ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కోరుట్ల లోని జువ్వాడి భవన్‌లో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో జగిత్యాల జిల్లా స్వర్ణకార సంఘ సంయుక్త కార్యదర్శి బి సి యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్రప్రసాద్, జువ్వాడి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ అంకిత్.




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 07, (నేటి మనదేశమ్),** సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# నేడు ప్రజావాణి వాయిదా

**అదిలాబాద్ జూన్ 07 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** సోమవారం రోజున కలెక్టర్ లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా గ్రామ సభలు,వార్డు సభల నిర్వహించాల్సి ఉందన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనవలసి ఉన్నందున రద్దు చేశామని,జిల్లా ప్రజలు ఈ ఈ విషయాన్ని గమనించగలరని కోరారు.



# శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో మారని తీరు?

**ఏసీబీ కేసు తర్వాతా చలనం లేని యంత్రాంగం**

**సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఎదురుచూపులు.. కొత్త తహసీల్దార్‌పై ప్రజల ఆశలు**



**శామీర్‌పేట జూన్ 07, (నేటి మనదేశమ్):** : జిల్లాలో చర్చనీయాంశంగా మారిన శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయం పనితీరుపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల అవినీతి ఆరోపణల నేపథ్యంలో జరిగిన పరిణామాలు రెవెన్యూ శాఖపై ప్రజల దృష్టిని మళ్లించగా, కార్యాలయ సేవల విషయంలో మాత్రం ఆశించిన మార్పు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఆదాయ, కుల, నివాస, వెరిఫికేషన్ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే దరఖాస్తుదారులు వారాల తరబడి, కొన్నిసార్లు నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పరిస్థితి కొనసాగుతోందని బాధితులు వాపోతున్నారు. సకాలంలో సేవలు అందకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల ఎస్సీ వెరిఫికేషన్ సర్టిఫికెట్ కోసం రెండు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానంటూ ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం, సిబ్బంది స్పందన లోపం ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తున్నారు.కొద్ది రోజుల క్రితం అప్పటి తహసీల్దార్ అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ కేసులో చిక్కుకోవడం జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే ఆ ఘటన తర్వాత కూడా కార్యాలయ పనితీరులో పెద్దగా మార్పు కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కింది స్థాయి సిబ్బంది వ్యవహారశైలిపై కూడా ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని తెలుస్తోంది.

**కొత్త తహసీల్దార్‌కు సవాళ్లే సవాళ్లు** ఇటీవల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌కు రెవెన్యూ పరిపాలనను గాడిలో పెట్టడం ప్రధాన సవాల్‌గా మారింది. విస్తారమైన మండల పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజలకు వేగవంతమైన సేవల అందజేత, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాలు సూచిస్తున్నాయి.

**పారదర్శకతపై ప్రజల డిమాండ్** అవినీతికి ఆస్కారం లేకుండా కార్యాలయ వ్యవస్థను బలోపేతం చేయాలని, దరఖాస్తుల పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితి అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న అంశాలపై సమీక్ష నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటేనే రెవెన్యూ శాఖపై విశ్వాసం పునరుద్ధరించబడుతుందని అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయం ముందు నిలిచిన ప్రధాన పరీక్ష ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమేనని స్థానికులు పేర్కొంటున్నారు.

# భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి 500 వ సంచార సత్సంగ మహోత్సవాలు ఘన విజయవంతం



**కోరుట్ల, జూన్ 07(నేటి మన దేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని కావేరి గార్డెన్స్‌లో జూన్ 5, 6, 7 తేదీలలో నిర్వహించిన భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి500వ సంచార సత్సంగ మహోత్సవాలు భక్తుల అపూర్వ స్పందన మధ్య అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో విజయవంతంగా ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ మహోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు, గురుస్మరణ, ధ్యాన కార్యక్రమాలు, సత్సంగాలు, శాంతి మంత్రాలు నిర్వహించబడ్డాయి. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన సుమారు 50 మంది పీఠాధిపతులు, స్వామీజీలు, మాతాజీలు పాల్గొని భక్తులకు ఆధ్యాత్మిక సందేశాలు అందించారు. మహోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు పాల్గొని గురుదేవుల ఆశీస్సులు పొందారు. భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి ఆశ్రమంలో పీఠాధిపతులు అయినటువంటి ఆచార్య శ్రీవారి తీర్థ స్వాముల వారు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం అందించారు. కార్యక్రమాలలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ, తీర్థ ప్రసాదాలు, గురుపాదుకా పూజలు, ప్రత్యేక ఆశీర్వచనాలు నిర్వహించబడ్డాయి. చివరి రోజు నిర్వహించిన మహాసభలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి వారి జీవితం, బోధనలు, సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. గురుదేవులు ప్రారంభించిన సత్సంగ పరంపర 500వ మైలురాయిని చేరుకోవడం ఆధ్యాత్మిక చరిత్రలో ఒక విశిష్ట ఘట్టమని పేర్కొన్నారు. మహోత్సవాలను విజయవంతం చేయడంలో సహకరించిన దాతలకు, భక్తులకు, సేవాదళ సభ్యులకు, వివిధ కమిటీల ప్రతినిధులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి ఆశీస్సులతో భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.


# ఫుడ్ కంట్రోలర్ పై చర్యలు తీసుకోవాలి.

**-ఎమ్మెల్యే పాయల్ శంకరకు వినతి పత్రం అందజేసిన సీవోసీ సభ్యులు**



**ఆదిలాబాద్ జూన్ 06 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** తాను ఏర్పాటు చేసుకున్న దళారుల ద్వారా అక్రమంగా వ్యాపారస్తుల దగ్గర వసూలు చేస్తూ వ్యాపార వాణిజ్య సంస్థల ప్రతినిధులను భయ భ్రాంతులకు గురిచేస్తున్న అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ నాయక్ తర్యాజ్ పై ఏసీబీ అధికారులు తో దర్యాప్తు చేసి అక్రమ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసి వెంటనే అతన్ని ఉద్యోగం నుంచి తొలగించాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ (ట్రేడ్స్) అసోసియేషన్ అధ్యక్షులు దినేష్ మాటోలియా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ కి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పాయల్ శంకర్ సానుకూలంగా స్పందించి నాయక్ పై తగు చర్యల కొరకు పై అధికారులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీవోసీ అధ్యక్షులు దినేష్ మాటోలియా, ప్రధాన కార్యదర్శులు కందుల రవీందర్,తానాజీ నిక్కమ్ మనోహర్ కుపాట్,కోశాధికారి సంతోష్ అగర్వాల్ సభ్యులు గంగాధర్,అమిత్ జీవని యోగేష్, మయూర్ పొద్దార్,బండారి వామన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ శిక్షణ, సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహణ



**కామారెడ్డ్,జూన్ 07.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్లు మరియు పార్టీ కార్యకర్తల కోసం ప్రత్యేక శిక్షణ, సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కర్, టీపీసీసీ అధికార ప్రతినిధి, బీఎల్ఏ మాస్టర్ ట్రైనర్ మేనేని రోహిత్ రావు డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు.మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూబీఎల్ఏలే పార్టీకి బలమైన పునాది.ఓటర్ జాబితాలో సవరణలు చేయడానికి కానీ ఓటర్ లిస్టులో కొత్తవారిని చేర్చడానికి బి ఎల్ ఎ ఉన్న అధికారం, ముఖ్యమంత్రి కూడా లేదు.బీఎల్ఏ ప్రాధాన్యతబూత్ లెవెల్ ఏజెంట్ అనేది పార్టీకి కళ్లు, చెవులూ వంటిదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి వ్యవస్థ అత్యంత కీలకమని అన్నారు. ప్రతి బీఎల్ఏ తన పరిధిలోని ఓటర్ల వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఓటరు జాబితాలో తప్పులు, లోపాలు ఉంటే వెంటనే గుర్తించి సరిచేసే బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాలు బలోపేతం కావాలంటే బీఎల్ఏలు నిరంతరం ప్రజలతో మమేకమై ఉండాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి బూత్ స్థాయి నిర్మాణమే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు.జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కర్ మాట్లాడుతూ ఓటరు జాబితాపై అప్రమత్తత అవసరం.ఎన్నికల విజయానికి బూత్ స్థాయి నిర్వహణ అత్యంత కీలకమని అన్నారు.ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి అంశాలపై బీఎల్ఏలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.పార్టీ సిద్ధాంతాలను గ్రామాలు, కాలనీలు, వార్డుల స్థాయికి తీసుకెళ్లడంలో బీఎల్ఏల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీలను మరింత బలోపేతం చేసి ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు.టీపీసీసీ స్పోక్ పర్సన్, బీఎల్ఏ మాస్టర్ ట్రైనర్ మేనేని రోహిత్ రావు మాట్లాడుతూబీఎల్ఏ బాధ్యతలు, విధులపై సమగ్ర శిక్షణ ఇవ్వడం, రాజ్యాంగాన్ని కాపాడటానికి.బీఎల్ఏల విధులు, బాధ్యతలు, ఎన్నికల సంఘం నిబంధనలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, డిజిటల్ విధానాల వినియోగం తదితర అంశాలపై సమగ్ర శిక్షణ కాంగ్రెస్ పార్టీ తరఫున ఇస్తున్నాం.ప్రతి బీఎల్ఏ తన బూత్ పరిధిలోని ప్రతి కుటుంబంతో సంబంధాలు కొనసాగించాలని, కొత్త ఓటర్లను గుర్తించి నమోదు చేయించడంతో పాటు అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించే బాధ్యత బీఎల్ఏలపై ఉంటుందని వివరించారు.ఓటరు జాబితా పరిరక్షణ, ఓటర్లతో నిరంతర సంబంధాలు, పార్టీ కార్యక్రమాల ప్రచారం, ప్రజా సమస్యల గుర్తింపు, ఎన్నికల సమయంలో సమర్థవంతమైన నిర్వహణ వంటి అంశాల్లో బీఎల్ఏలు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సందీప్, కౌన్సిలర్లు అంజాద్, లడ్డు, అఖిల, ఫెరోజ్ సుల్తానా, కళ్లెం సావిత్రి, యూనుస్, సీనియర్ నాయకులు ఇప్ప శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొనె శ్రీనివాస్, సుదర్శన్, మండల అధ్యక్షులు కృష్ణ రావు, నరేందర్ రెడ్డి, రాజగౌడ్, నౌసిలాల్, శ్రీనివాస్, రమేష్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుట్నాల శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు గుడుగుల శ్రీనివాస్, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు కన్నయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్సాహంగా '5కె రన్'.. ప్రారంభించిన జిల్లా ఎస్పీ



**ఆదిలాబాద్ జూన్ 07 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన '5కె రన్' ఉత్సాహంగా సాగింది.స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ఈ పరుగును ఎస్పీ అఖిల్ మహాజన్ జెండా ఊపి ప్రారంభించారు.ప్రారంభానికి ముందు తెలంగాణ గీతాన్ని ఆలపించారు.ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి కలెక్టర్ చౌక్,రాంనగర్ అక్కడి నుండి తిరిగి స్టేడియం వరకు ఉత్సాహ భరితంగా విజయవంతంగా సాగిన ఈ 5కే రన్ లో జిల్లా నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులు,యువత స్థానిక ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ రన్నింగ్ చేయడం వల్ల శరీరానికి ఎన్నో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు.నేటి ఆధునిక కాలంలో ఆరోగ్యకరమైన జీవనం సాగించడం కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామాలను తమ నిత్యజీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ 5కే రన్ పురుషుల కేటగిరీ లో ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాల్లో వారికి ప్రథమ రూ.5000,ద్వితీయ రూ.3000,తృతీయ రూ.2000 నగదు బహుమతులు,తరువాతి విజేతలకు కన్సోలేషన్ బహుమతులతో పాటు మెడల్స్ లను ఎస్పీ ,డిఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్,అందజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి,డివైఎస్ఓ శ్రీనివాస్,ఎఫ్డీఓ అరవింద్,ఎఫ్ఆర్ఓలు రాథోడ్ అవినాష్ ,శీలానంద్,శ్రీనివాస్,అనిత,అటవీ,పోలీస్,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది,క్రీడాకారులు,యువత,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# 22 ఏళ్ల తర్వాత ఓటరు సవరణ ప్రక్రియ.- కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ జూన్ 06 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ను అత్యంత ప్రాధాన్యతతో,బాధ్యతాయుతంగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.శనివారం స్థానిక ఎస్టీయూ భవన్ లో నిర్వహించిన ఓటరు ప్రత్యేక సవరణ అవగాహనా సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించి అధికారులకు,సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో,బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు.గత 2002 సంవత్సరం తర్వాత దాదాపు 22 ఏళ్లకు ఈ తరహా ఓటరు సవరణ ప్రక్రియ మళ్లీ జరుగుతోందని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.సంబంధిత అధికారులు సమన్వయంతో మొదటి ప్రాధాన్యత తో పూర్తి చేయాలనీ సూచించారు.ఈ అవగాహన సదస్సులో ఆర్డీఓ జగదీశ్వర్ రావు,డిహెమ్హెచ్ఓ నరేందర్ రాథోడ్,డిడబ్ల్యూఓ మిల్కా,మెప్మా పిడి రాజు,తహసీల్దార్లు,సూపర్ వైజర్లు,వార్డ్ అధికారులు,బిఎల్ఓలు,ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు ఇస్తున్నారా?



**జగిత్యాల జూన్ 7(నేటి మన దేశమ్ ప్రతినిధి):**కొందరు అప్పు తీసుకున్నప్పుడు, లేదా ఇతర ఆర్థిక లావాదే వీల సమయంలో ఎదుటి వ్యక్తికి నమ్మకం కలిగించడానికి పూరించని ఖాళీ చెక్కులు, పూరించని అప్పు పత్రాలు (బ్లాంక్ ప్రామిసరీ నోట్లు )ఇస్తుంటారు. వాటిని దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీనియర్ న్యాయవాది హరి అశోక్ కుమార్ ఇలా వివరించారు. అట్టి పూరించని ఖాళీ చెక్కులను, ప్రామిసరీ నోట్లను దుర్వినియోగం చేస్తే నె గోషియబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్ 1881 ప్రకారం క్రిమినల్, సివిల్ కేసులు వేయచ్చు.తేదీ, లబ్ధిదారు పేరు రాయకుండా కేవలం సంతకం మాత్రమే చేసి ఇచ్చేదే బ్లాంక్ చెక్కు, రూపాయలు, తేదీ ప్రయోజనం లేకుండా సంతకం చేసి ఇచ్చే పత్రం బ్లాంక్ ప్రామిసరీ నోట్. ఇటువంటివి తీసుకున్న వ్యక్తి తీసుకున్న నగదు కంటే ఎక్కువ రాసి అధిక మొత్తం వసూలు చేసే అవకాశం ఉంది కేవలం సెక్యూరిటీ నిమిత్తం ఇచ్చామని కోర్టులో రుజువు చేయలేకపోతే సెక్షన్ 20 ప్రకారం ఆ చెక్కులు చెల్లుబాటు అవుతాయి. సాధ్యం అయినంత వరకు ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు ఎవరికీ ఇవ్వొద్దు. ఇవ్వాల్సిన పరిస్థితి వస్తే సాక్షుల సమక్షంలో చెక్కు మీద లబ్ధిదారు పేరు, తీసుకున్న మొత్తం స్పష్టంగా రాయాలి. ఇచ్చిన తరువాత ఫోటో లేదా జిరాక్స్ తీసుకోవాలి. డబ్బు లావాదేవీలు బ్యాంక్ ద్వారా జరుపుకోవాలని సీనియర్ న్యాయ వాది హరి అశోక్ కుమార్ సూచించారు.

# ఎల్లారెడ్డి అభివృద్ధి ఎమ్మెల్యే మదన్మోహన్ తోనే సాధ్యం

**మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీమతి భాగ్యవతి**




**కామారెడ్డ్,జూన్ 07.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**ఎల్లారెడ్డి పట్టణంలోని మున్సిపల్ వైస్ చైర్మన్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో 7వ వార్డ్ లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులు జోరందుకున్నాయి. ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే సహకారంతో ఎల్లారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీమతి మత్తమాల భాగ్యవతి,ప్రశాంత్ గౌడ్ ఇచ్చిన మాటని నిలబెట్టుకున్నారు.

# పేద ప్రజల నడ్డి విరుస్తున్న మోడీ సర్కార్

**అంబేద్కర్ చౌరస్తాలో వంటా వార్పుతో నిరసన చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు**

**గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ వంటా వార్పు, ధర్నా**

**హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి**



**హుస్నాబాద్ జూన్ 07 నేటి మనదేశమ్ :**పెట్రో ఉత్పత్తులైన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను అడ్డగోలుగా పెంచుతూ ప్రధాని నరేంద్ర మోడీ పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి మండిపడ్డారు.ఆదివారం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కట్టెల పొయ్యి మీద వంట చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో దేశ ప్రజలను మోసం చేస్తుందని, గత రెండు నెలల కాలంలోనే ఇంధన ధరలను మూడుసార్లు పెంచి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో ప్రపంచవ్యాప్తంగా 110 డాలర్లకు ఒక బ్యారెల్ ధర ఉన్న సమయంలో పెట్రోల్ ధర 67 రూపాయలు, డీజిల్ ధర 53 రూపాయలు ఉండేదని, ప్రస్తుతం 106 డాలర్లకు ఒక బ్యారెల్ వస్తున్నా పెట్రోలు ధరలు 110 కి చేరిందని, ఇది ముమ్మాటికి ప్రధాని మోడీ వైఫల్యమేనని అన్నారు. ధరల నియంత్రణ చేతగాని మోడీ ప్రధాని పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న, వద్దేపల్లి రమణ, మున్సిపల్ కౌన్సిలర్లు బూర్గు లత, పూదరి వరప్రసాద్,సావుల మంజుల, వైద్యం కిరణ్, బొలిశెట్టి రాజు, పిల్లి తిరుపతి, భూక్య సంపత్, బత్తుల స్వరూప, కేశవేణి రమేష్, నాయకులు గట్టు రాములు, పూదరి శ్రీనివాస్, పున్న రంజిత్, సాగర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and
Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com